



ఆదాయం.. అదరహో

ముస్సిపాల్టీల ఆదాయం పెరిగింది. పన్నులు పెంచకుండా ఆదాయం పెంచుకోవాలని ముస్సిపాల్టీలను ప్రభుత్వం ఆదేశించింది. ముస్సిపాల్టీలు స్వయంగా ఆర్థిక ప్రతిపత్తిని సాధించాలని, నిధుల కోసం ప్రభుత్వం వైపు చూడకుండా వనరులు పెంచుకునే దిశగా, ఆదాయం పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఇంటింటి పన్నుల పరిశీలన చేపట్టారు. దీంతో ఇప్పటి వరకు పన్నులు వేయని ఆస్తులు, తక్కువ మొత్తంలో పన్నులు చెల్లిస్తున్న ఆస్తులను అధికారులు గుర్తించారు. ఇంటింటి సర్వేతో ఇబ్బడిముబ్బడిగా పన్నుల ఆదాయం పెరిగింది. ఇప్పటి వరకు జరిగిన సర్వే పునః పరిశీలనకు ఇతర ముస్సిపాల్టీల నుంచి ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేయనున్నారు. పన్నుల్లో అక్రమాలకు చెక్ పెట్టి తద్వారా ముస్సిపాల్టీల ఆదాయాలను పెంచుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

- పురాల్లో పెరిగిన ఆస్తి పన్నులు
- ఇంటింటి సర్వేలో పన్ను వేయని ఆస్తుల గుర్తింపు
- మూడు జిల్లాల్లో పెరిగిన వార్షిక ఆదాయం రూ.28.02 కోట్లు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఆదేశాలతో పురపాలకులు ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై పురపాలకులు దృష్టి సారించారు. ఈ క్రమంలో ప్రధాన ఆదాయాల్లో కీలకమైన ఆస్తి పన్నులపై దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో ఆస్తి పన్నుకు సంబంధించి సమగ్ర పరిశీలన చేపట్టారు. దీంతో ఇంటింటి సర్వే చేపట్టారు. ముస్సిపాల్టీల్లో ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. చేజారిన పన్నుల ఆదాయాలను చేజిక్కించుకుంటున్నాయి. పురాల్లో ఆస్తి పన్ను పునఃపరిశీలనకు ఇంటింటి సర్వే గడువు ఈ నెల 10న ముగిసింది. ఇప్పటికి 75 శాతం సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో సర్వేను కొనసాగించాలని ఆర్డీ హరికృష్ణ ముస్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు సర్వే చేసిన ఆస్తులకు సంబంధించి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని ముస్సిపాల్టీల వార్షిక ఆదాయం రూ.28.02 కోట్లు పెరిగింది.

సర్వేతో అక్రమాలకు చెక్

వైసీపీ హయాంలో అధికారం అండతో ఇళ్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు తక్కువగా పన్ను విధింపు జరిగినట్లు సర్వే ద్వారా అధికారులు నిర్ధారించారు. పన్ను మదింపులో గతంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు తేలింది. పన్నుల విధానాన్ని గత టీడీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ చేసింది. అయితే కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తప్పుడు కొలతలు నమోదు చేయడంతో పన్ను తక్కువగా నమోదైనట్లు ఇంటింటి సర్వేలో గుర్తించారు. అలాగే ఇంటి కోసం నిర్మించిన భవనాన్ని వ్యాపార.. వాణిజ్య అవసరాలకు వినియోగించడం, పన్ను విధించిన సమయంలో ఒక అంతస్తు భవనంపై కట్టడాలు వంటివి కూడా చోటు చేసుకున్నట్లు తేలింది. ఈ అక్రమాలను సర్వేలో గుర్తించి పన్ను విధించారు. దీంతో పలు ముస్సిపాల్టీలో ఆదాయం గణనీయంగా పెరిగింది.



సర్వేతో పెరిగిన ఆదాయం (రూ.లక్షల్లో)

గుంటూరు జిల్లా	
గుంటూరు	460
మంగళగిరి	397
తెనాలి	84
పొన్నూరు	31
వినుకొండ	36
పల్నాడు జిల్లా	
నరసరావుపేట	89
దాచేపల్లి	7
సత్తెనపల్లి	29
పిడుగురాళ్ల	26
మాచర్ల	36
గురజాల	12
బాపట్ల జిల్లా	
బాపట్ల	87
అద్దంకి	20
చీరాల	52
రేపల్లె	35

అమరావతి నుంచే.. ఇక సీఆర్‌డీఏ పాలన



- సర్వహంగులతో సిద్ధమైన ప్రధాన కార్యాలయం
- నేడు రాయపూడిలో సీఎం చంద్రబాబు ప్రారంభోత్సవం
- అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ
- రాజధానిలో అందుబాటులోకి ప్రభుత్వ తొలి శాశ్వత పాలనా భవనం

తుళ్లూరు, గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో పాలనా సౌలభ్యం కొరకు సర్వహంగులతో సిద్ధమైన సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయాన్ని సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. రాజధాని అమరావతిని ప్రతిబింబించేలా 'ఏ' అక్షరం ఎలివేషన్‌తో అత్యద్భుతంగా సీఆర్‌డీఏ కార్యాలయాన్ని నిర్మించారు. విజయవాడ కేంద్రంగా సాగిన సీఆర్‌డీఏ కార్యకలాపాలు ఇక నుంచి రాయపూడిలో నూతనంగా నిర్మించిన ప్రధాన కార్యాలయం నుంచి సాగనున్నాయి. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు దగ్గరగా అమరావతి కేంద్రంగా పరిపాలన ప్రారంభం కా నున్నది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ సహా ముస్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ పరిధిలో పనిచేయాల్సిన అన్ని విభాగాలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. రాజధాని రైతులు సమస్యలకు సంబంధించి ఇప్పటి వరకు విజయవాడ రావాల్సి వచ్చేది. ఇక మీదట తమ స్థానిక ప్రాంతంలోనే కార్యాలయం ఉండటం (మిగతా 6వ పేజీలో)





ముస్సిపల్ శాఖ హెచ్‌వోడీల భవనాలలో ఓ భవనం



సీఆర్డీఏ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

తురకపాలెం బాధితులకు ఆర్థిక సాయం

- 28 కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పంపిణీ
- సాధారణ పరిస్థితులకు ప్రభుత్వం కృషి : కేంద్రమంత్రి పెమ్మసాని

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని తురకపాలెం గ్రామంలో అంతుచిక్కని వ్యాధులతో చనిపోయిన కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రత్యేకంగా చొరవ తీసుకుని పరిహారం మంజూరు చేశారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలో మొత్తం 28 బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ కోటి 40 లక్షలను ఆదివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ గ్రామంలో పూర్తి స్థాయిలో సాధారణ పరిస్థితులు నెలకునేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాల్లోని వారికి భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి సహకారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మెలియోయిడోసిస్ వ్యాధి అనేది తెలియకుండా వ్యాపించిందని, దానివల్లే ఈ మరణాలు సంభవించాయన్నారు. వైద్యాధికారుల పర్యవేక్షణలో వివిధ రకాల పరీక్షలు(61 వేలు) జరిగాయని తెలిపారు. సహజ మరణాలకు కూడా పరిహారం అందించాలన్న చంద్రబాబు నాయుడి ఆలోచన అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ తురకపాలెంలో రాష్ట్రస్థాయి నుంచి నిపుణుల నేతృత్వంలో పర్యవేక్షణతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కొంత మంది బాధితులు సరైన అవగాహన లేక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా, చికిత్స ఆలస్యం కావడంతో పరిస్థితి చేయి జారిపోయిన ఘటనలు ఏర్పాడ్డాయన్నారు. అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందిన మహిళ కుటుంబానికి కూడా ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు చెక్కును అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని , కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరుల

రాజధాని రైతు సమస్యలపై తాత్సారం

- అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి నేతలు

గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 15 నెలలు దాటినా అమరావతి రాజధానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించలేదని అమరావతి రాజధాని రైతు ఐక్య కార్యాచరణ సమితి నేతలు తెలిపారు. గుంటూరులో ఆదివారం జేఏసీ నేతలు సమావేశమై రాజధాని రైతుల సమస్యలపై చర్చించారు. అనంతరం జేఏసీ అధ్యక్షుడు మాదల శ్రీనివాస్ మీడియాకు తమ వైఖరిని వివరించారు. సమస్యలు పరిష్కరించకుంటే రైతులు, రైతు కూలీలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రైతుల సమస్యలపై అనేకసార్లు సీఆర్‌డీఏ అధికారులు, మంత్రి నారాయణకు వినతిపత్రాలతో పాటు పీజీఆర్ఎస్, గ్రీవెన్స్ సదస్సుల్లోనూ నివేదించామన్నారు. వాటిలో ఏ ఒక్కటి కూడా ఇప్పటివరకు పరిష్కరించలేదని తెలిపారు. అసైన్డ్ భూముల రైతుల కౌలు చెల్లింపు క్రమబద్ధీకరణ, రోడ్డు పోటు ఉన్న ప్లాట్ల సమస్యలు అలానే ఉన్నాయన్నారు. ఇంకా కొంతమందికి లే అవుట్లలో ప్లాట్ల కేటాయింపు జరగలేదని, గ్రామ కంఠాల సమస్య పరిష్కరించలేదన్నారు. సీఆర్‌డీఏలో కింది స్థాయి అధికారుల అవినీతిపై రైతులు, కూలీలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. రాజధాని ప్రాంత ప్రజల స్వయం ఉపాధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గతంలో అమరావతి ప్రజలకు ఫస్టు సిటిజన్ కార్డులు ఇస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. అమరావతి ఉద్యమంలో ముందుండి పోరాడిన జేఏసీపై తీవ్ర ఒత్తిడి వస్తున్నందున తాము సమావేశం కావాల్సి వచ్చిందన్నారు. అమరావతి ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయని రైతుల జ్ఞాపకార్థం స్మారక స్థూపం ఏర్పాటు చేయాలని కోరినా అది కార్యరూపం దాల్చలేదన్నారు. ఇంకా కొన్ని కేసులు తమను వెంటాడుతున్నాయని, వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలని కోరుతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు కల్లం రాజశేఖర్‌రెడ్డి, జమ్ముల శ్యాంకిశోర్, అనుమోలు బాలమురళీకృష్ణ, బెల్లంకొండ నరసింహారావు, కొండేపాటి సతీష్ చంద్ర, జుజ్జుల చలపతిరావు, పువ్వాడ సురేంద్ర, బెజవాడ రమేష్‌బాబు పాల్గొన్నారు.



గుంటూరులో సమావేశమైన అమరావతి రాజధాని రైతు ఐక్య కార్యాచరణ సమితి నాయకులు

సత్వరం సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఉద్యమబాట పట్టకముందే ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గుంటూరులో ఆదివారం జరిగిన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయిలు కోసం ఎదురు చూస్తూనే చాలామంది విశ్రాంత ఉద్యోగులు చనిపోతున్నారని తెలిపారు. చట్టబద్ధంగా నియమించాల్సిన పీఆర్సీ కమిటీ, డీఏలు, బకాయిలతో పాటు ఐఆర్ ఇవ్వకుండా ఉద్యోగులను బాధపెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న నాలుగోతరగతి ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కూడా కార్యవర్గాలను ఏర్పాటు చేసుకుంటున్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప, జిల్లా అధ్యక్షుడు కొండయ్య, ఏపీజేఏసి అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదరరావు, రాష్ట్ర మహిళా కమిటీ చైర్‌పర్సన్ పారే లక్ష్మి, నగర జేఏసీ ప్రధాన కార్యదర్శి శంకరరావు, ఏపీ ప్రభుత్వ డ్రైవర్స్ అసోషియేషన్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, జిల్లా రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు పీఏ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఈ-క్రాప్ గడువు పెంపు

- నత్తనడకన పంట నమోదు
- 25 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు
- వెబ్‌ల్యాండ్‌లో భూమి మొత్తం ఈ-క్రాప్‌లోకి..

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ఇన్‌పుట్ సబ్సిడీ మొదలు, విత్తనాల రాయితీ వరకు రైతులకు ఈ-క్రాప్ ప్రామాణికం. ఈ-క్రాప్ నమోదును పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో కేవలం సాగులోని పైర్ల నమోదుకే పరిమితమైన ప్రక్రియ తొలిసారి వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూముల వివరాలన్నీ ఈ-క్రాప్‌లో నిక్షిప్తం చేయాలని ఆదేశించింది.ఈ ప్రక్రియ పూర్తికి సెప్టెంబరు 30 వరకు తొలుత ప్రభుత్వం గడువు విధించింది. అయితే వ్యవసాయ భూమి నమోదు దాదాపుగా కొలిక్కి వచ్చినప్పటికీ, నిరుపయోగ భూముల వివరాల నిక్షిప్తం చేసే ప్రక్రియ నత్తనడకన సాగుతూఉంది. దీంతో ఈ-క్రాప్ నమోదుకు ఈ నెల 25 వరకు గడువు పొడిగిస్తూ తాజాగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే దాదాపు మూడున్నర నెలలు దాటింది. కానీ సాగు విస్తీర్ణం అంచనాలకు, ప్రస్తుత సాగుకు భారీ వ్యత్యాసం కనబడుతోంది. ఈ-క్రాప్ నమోదులో సిబ్బంది అలసత్వం రైతుల పాలిట శాపంగా మారుతోంది. ప్రస్తుత సాగులో ముంపు బారిన పడిన పైరులో కనీసం 15 శాతం కూడా గతంలో ఈ-క్రాప్ రికార్డుల్లో ఎక్కలేదు. అంటే వీరందరికీ అందే ఇన్‌పుట్ సబ్సిడీకి గండిపడినట్లే.

నమోదులో అనేక ప్రతిబంధకాలు..

గతంలో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా రైతు చెప్పిన సాగు వివరాలతో ఈ-క్రాప్ నమోదును మమ అనిపించేవారు. దీని వల్ల ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు పొలంలో ఉన్న పంట ఒక్కటి ఉండగా రికార్డుల్లో మరో పంట దర్శనమిచ్చేది. దీంతో రైతులకు అందాల్సిన ప్రయోజనాలు అందకుండా పోయేవి. ఇలాంటి తప్పిదాల కు ఆస్కారం లేకుండా ఈ-క్రాప్ నమోదు వంద శాతం కచ్చితత్వంతో జరగాలనేది ప్రభుత్వం ఉద్దేశంగా ఉంది. కానీ పక్కాగా వివరాల నమోదుకు క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతుండడంతో ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. సిబ్బంది కొరతతో ఫీల్డ్ విజిట్ కష్టసాధ్యంగా మారింది. దీనికి తోడు వైసీపీ వది లేసి వెళ్లిన రీసర్వే తప్పులు, రైతులు అందుబాటులో లేక పోవడం, ఆన్‌లైన్‌లో భూముల వివరాలు తప్పుల తడకగా ఉండడం వంటివన్నీ ఈ-క్రాప్ నమోదుకు ప్రతిబంధకాలుగా ఉంటున్నాయి.



అమృతలూరు మండల పరిధిలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

జిల్లాల వారీగా ఇలా..

బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు సాగైన విస్తీర్ణం 2,71,322 ఎకరాలు కాగా, ఈ-క్రాప్‌లో నమోదైంది 2,34,432 ఎకరాలు. జిల్లాలో మొత్తం భూముల వివరాలను 9,34,451 ఎకరాలుగా తేల్చి ఆ రికార్డులను ఏవోల లాగిన్‌లకు ప్రభుత్వం పంపించింది. మొత్తం గా చూస్తే ఇప్పటి వరకు 4,11,490 ఎకరాలు మాత్రమే ఈ-పంటలోకి ఎక్కింది.


- గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకు 2,13,687 ఎకరాలు సాగు కాగా ఇందులో 1,97,360 ఎకరా లు ఈ-క్రాప్‌లో నమోదైంది. వెబ్‌ల్యాండ్ రికార్డుల ప్రకారం 5,78,610 ఎకరాలు కాగా, 2,44,427 ఎకరాలకే ఈ-పంట పరిమితమైంది.

- పల్నాడు జిల్లాలో సాగు విస్తీర్ణం 4,23,026 ఎకరాలు. కాగా ఇందు లో ఇప్పటి వరకు 3,75,929 ఎకరాలే ఈ-పంట లోకి ఎక్కింది.



ముందస్తు.. మంచు తెరలు

గుంటూరు నగరాన్ని ఆదివారం మంచు దుప్పటి కప్పేసింది. సాధారణంగా జనవరిలో మంచు కురుస్తుం ది. గత కొద్ది రోజులుగా అడపాదడపా భారీగా వర్షాల పడుతున్నాయి. శనివారం అర్ధరాత్రి నుంచి నగరాన్ని మంచు పూర్తిగా కమ్మేసింది. మంచు తెరల నడుమ ఆదివారం ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.
- గుంటూరు (ఆంధ్రజ్యోతి)



క్యూఆర్ కోడ్ స్కాన్‌తో సమగ్ర సమాచారం

● పర్యాటకుల కోసం అమరావతి మ్యూజియంలో ప్రత్యేక ఏర్పాట్లు
● మూడు భాషలలో సమాచారం లభ్యమయ్యేలా రూపకల్పన



శిల్ప కళాఖండం దిగువున ఉన్న క్యూఆర్ కోడ్

అమరావతి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పర్యాటక కేంద్రం అమరావతిలోని కేంద్ర పురావస్తు ప్రదర్శనశాలలో మహాచైత్యానికి సంబంధించిన శిల్పాలు, తవ్వకాలలో బయల్పడిన ఆహార, అలంకరణ వస్తువులు ప్రత్యేక గ్యాలరీలలో ఉన్నాయి. మ్యూజియం సందర్శించిన పర్యాటకులకు శిల్పాల చారిత్రక నేపథ్యం, వాటి ప్రాముఖ్యత, సమాచారం తెలియజేసేందుకు గతంలో గైడ్‌లు ఉండేవారు. ప్రస్తుతం వారు అందుబాటులో లేకపోవడంతో దానికి ప్రత్యామ్నాయంగా కేంద్ర పురావస్తుశాఖ ప్రయోగాత్మకంగా 50 శిల్పాలకు క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటుచేసింది. పురావస్తు ప్రదర్శన శాలలో 150 శిల్పాలు ఉండగా మిగిలిన వాటికి రానున్న రోజులలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తామని ప్రదర్శనశాల సూపరింటెండెంట్ సూర్యప్రకాశ్ తెలిపారు. క్యూఆర్ కోడ్ ఉన్న శిల్పం వద్ద సెల్‌ఫోన్‌తో స్కాన్‌చేస్తే మూడు భాషలలో దాని గురించిన సమాచారం లభ్యమవుతుందని, దీంతో పర్యాటకులకు సమగ్ర సమాచారం అందనుందని పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి

పెదకూరపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు కింద పడి పెదకూరపాడుకు చెందిన ఆరుద్ర శివకృష్ణ (26) అనే యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పెదకూరపాడు రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, గుంటూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌరాణిక పద్య నాటకం తెలుగుజాతి సంపద

● తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గోపాలకృష్ణ



ప్రసంగిస్తున్న తెలుగు నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ గుమ్మడి గోపాలకృష్ణ

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక పద్యనాటకం తెలుగుజాతి వారసత్వ సంపదని తెలుగు నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. శనివారం నరసరావుపేట భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరిగిన నెలవారీ సాంస్కృతిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, నరసరావుపేటలో భువనచంద్ర టౌన్‌హాల్‌ను నిర్మించి, నెలవారీ కార్యక్రమాలలో భాగంగా ఎన్నో వినూత్న కార్యక్రమాలు నిర్వహించిన మహనీయుడు స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాద్ అని కొనియాడారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రస్తుత కమిటీ నెలవారీ కార్యక్రమాలను పునరుద్ధరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవా డ అరవిందబాబు ఆధ్వర్యంలో మరిన్ని మంచి కార్యక్రమాలు జరుగుతాయని గోపాలకృష్ణ ఆ శాభావాన్ని వ్యక్తంచేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ, దివంగత డాక్టర్ కోడెల ఆశయాలను కొనసాగిస్తూ నెలవారీ కార్యక్రమాలు నిర్వహించేలా కృషి చేస్తానన్నారు. నరసరావుపేట కళలకు పుట్టినిల్లు వంటిదని, ఎందరో కవులు, కళాకారులు ఇక్కడ జన్మించి నాటక రంగంలో, సినిమా రంగంలో రాణించారన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన భూకైలాస్ పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను అలరించింది. సభకు టౌన్‌హాల్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకట్రావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బారాయ గుప్తా, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, రాకీ మీడియా అధినేత నల్లపాటి రామచంద్రప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, సంరక్ష సొసైటీ వ్యవస్థాపకుడు బీఆర్ సుశీల్ కుమార్, రంగస్థలి మాజీ అధ్యక్షుడు కిలారు వెంకట్రావు, సెక్రటరీ నల్లపాటి బోస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నేపాల్ యువకుల దుర్మరణం



మనోజ్ బిస్తా (ఫైల్)

మంగళగిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణ పరిధిలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నేపాల్‌కు చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. గుంటూరు జిల్లా పెదకాకాని సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఏడాది కాలం నుంచి నేపాల్‌కు చెందిన మనోజ్ బిస్తా (26), రాకేశ్ (34) పనిచేస్తున్నారు. భ్రమరాంబపురం కాలనీలో ఓ రూము అద్దెకు తీసుకుని ప్రతిరోజు విధులకు వెళుతుంటారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి 12 గంటలకు వారి విధులను ముగించుకుని యాజమాని వద్ద నుంచి స్కూటీ తీసుకుని వెళ్లారు. తిరిగి వెళ్లే క్రమంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు నాలుగున్నర గంటల సమయంలో జాతీయ రహదారిపై విజయవాడ వైపు వెళుతుండగా మంగళగిరి వద్ద వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. బైకుపై ఉన్న ఇద్దరు యువకులు రోడ్డు మధ్యలో పడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ బస్సు వారిపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆడపిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి

● ఏపి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



రాయపాటి శైలజను సత్కరిస్తున్న నూతక్కి రామకృష్ణ ప్రసాద్ దంపతులు, కమ్మ జన సేవా సమితి సభ్యులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని ఏపి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. గుంటూరులోని కమ్మ బాలికల వసతి గృహంలో ఆదివారం 23వ తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి కమ్మజనసేవ సమితి అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి అధ్యక్షత వహించారు. సమావేశంలో రాయపాటి శైలజ మాట్లాడుతూ, విద్యార్థులు ఇతర విషయాలపై ఆకర్షితులు గాకుండా చదువుపై శ్రద్ధ చూపాలని సూచించారు. భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ, 2వేలమందికి వసతి కల్పించేందుకు నిర్మిస్తున్న నూతన భవనానికి ప్రవాసాంధ్రుడు నూతక్కి రామకృష్ణ ప్రసాద్ అందిస్తున్న ఆర్థిక చేయూత అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపిటిఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం, ఎన్ఆర్ఐ విద్యాసంస్థల ఈడీ తిలక్, కమ్మ జనోద్ధారక స్ఫూర్తిప్రదాత చల్లా రాజేంద్రప్రసాద్, నూతక్కి రామకృష్ణ ప్రసాద్, భారతీయం సత్యవాణి, బౌద్ధమత తత్త్వవేత్త డాక్టర్ మల్లెంపాటి సాంబశివరావు, కేవసిసి అధ్యక్షుడు యర్రా నాగేశ్వరరావు, నూతక్కి సీతా మహాలక్ష్మి, కోవెలమూడి సాంబశివరావు, చుక్కపల్లి రమేశ్, మాదల రత్నగిరిబాబు, రావెల సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. అనంతరం గంగూరి బాబురావు ఉపకార వేతనాల నిధికి రూ.20లక్షల చెక్కును అందజేశారు.



సంఘీబావం తెలియజేస్తున్న సంఘం నేతలు

సమష్టిగా ఉంటేనే బంజారాల సమస్యలు పరిష్కారం

● ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నేతలు

గుంటూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సమష్టిగా ఉంటేనే బంజారావర్గం ప్రజలు సమస్యలు పరిష్కరించుకోవచ్చని, లేకుంటే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు వస్తాయని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొర్ర జగన్నాధరావు, జాతీయ కమిటీ నాయకులు పీఎల్ రవీందర్‌నాయక్ పేర్కొన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన మందిరంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సభ జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ చక్రి నాయక్, స్టేట్ జనరల్ సెక్రటరీ జటావత్ రాంబాబు మాట్లాడుతూ, బంజారా ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 15 లక్షలకు పైగా ఉన్నారన్నారు. చట్టసభల్లో వాణిని వినిపించేందుకు కనీసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు లేవని వాపోయారు. చట్టసభల్లో తమకు అవకాశం కల్పించాలని కోరారు. తండాలలో బంజారా ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారం కోసం త్వరలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బీబీవీ నాయక్, బద్దే నాయక్, డాక్టర్ బాలాజీనాయక్, జటావత్ బాలాజీనాయక్, బానోత్ శ్రీనివాసనాయక్, లాల్యా నాయక్ పలువురు రాష్ట్ర, జిల్లాల నాయకులున్నారు.

వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు



ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పీపీపీ విధానంలో కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలలో నాణ్యమైన ఉచితవిద్య అందిస్తే వైసీపీకి అభ్యంతరం ఏమిటో అర్థంకావడం లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, దాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 17 వైద్య కళాశాలలకు అనుమతులు వచ్చినా వాటి నిర్మాణాన్ని ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయారని, కొన్ని పునాదుల స్థాయిలోనే ఆగిపోయాయని చెప్పారు. ముఖ్యమంత్రిగా 15 ఏళ్లు పూర్తిచేసుకున్న చంద్రబాబు, దేశంలో అతి ఎక్కువ సమయం సీఎంగా పనిచేసిన వ్యక్తులలో ప్రథముడిగా నిలిచారన్నారు. దూరదృష్టి, నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయం చంద్రబాబుదని, అలాంటి ముఖ్యమంత్రి వల్లే రాష్ట్రం అభివృద్ధి దిశలో కొనసాగుతోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

19న ఉమ్మడి జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

పిడుగురాళ్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పురుషుల సీనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ఈ నెల 19న పిడుగురాళ్లలోని స్కాలర్స్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వంశీకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి సామంతరెడ్డి, కోశాధికారి ఆవుల జనార్ధన్ తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు నవంబరు 8, 9వ తేదీలలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యేవారు ఆధార్‌కార్డు జిరాక్స్, 3 పాస్‌ఫోటోలు తీసుకొనిరావాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 9885395457, 9666723772 నంబర్లకు సంప్రదించాలన్నారు.

సాగర్‌లో 4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



4 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్టు అధికారులు ఆదివారం 4 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, సాగర్ జలాశయ నీటిమట్టం 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8108 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,805 క్యూసెక్కులు, 4 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 32,361 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 84,469 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 67,869 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 82,485 క్యూసెక్కుల నీటి విడుదల

రెంటచింతల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి 4 క్రస్ట్ గేట్లను ఎత్తి 74,232 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి అనంతరం టీఆర్సీ ద్వారా 8,253 క్యూసెక్కులు మొత్తంగా 82,485 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం,నాగరాజులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.9866 ఎంయూల విద్యుత్ తయారైంది..ఎగువన వున్న సాగర్,ఎత్తిపోతల,హాలియా వాగుల నుంచి 65,121 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు. ఇప్పటి వరకు 43.560 ఎంయూల విద్యుత్ తయారైందని, 2026 మార్చి 31నాటికి 78 ఎంయూలు లక్ష్యంగా నిర్ణయించారని పేర్కొన్నారు.

అమరావతి నుంచే.. ఇక సీఆర్‌డీఏ పాలన

(5వ పేజీ తరువాయి)

వల్ల వారికి సౌకర్యంగా మారింది.

అమరావతి చరిత్రలో తొలిస్థానం

పదకొండేళ్ల నిరీక్షణకు తెరవేస్తూ నిర్మితమైన తొలి శాశ్విత పరిపాలనా భవనంగా సీఆర్డీఏ కార్యాలయం రాజధాని అమరావతి చరిత్రలో స్థానం సంపాదించుకుంది. ప్రజా రాజధానిలో పాలనా సౌలభ్యంకొరకు సీఆర్‌డీఏ, మున్సిపల్, మెప్మా, రెరా తదితర అన్ని విభాగాలు ఒకేప్రాంతంలో సరికొత్త హంగులతో ఈ భవనాన్ని నిర్మించారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు దగ్గరగా ఏర్పాటైన ఈ కార్యాలయంతో వారిలో చెప్పలేని ఆనందాన్ని నింపుతోంది. కాగా ఆదివారం మంత్రి నారాయణ సీఆర్‌డీఏ కార్యాలయ ప్రాంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులతో మంత్రి చర్చించి పలు సూచనలు చేశారు.

కార్యాలయ వివరాలు..

ఈ-3 ఎన్-11రోడ్ల జంక్షన్ దగ్గర రాయపూడిలో 4.32ఎకరాల విస్తీర్ణంలో జీప్లస్+7విధానంలో సీఆర్‌డీఏ ప్రధానకార్యాలయం నిర్మించారు.

గ్రౌండ్ ఫ్లోర్: పబ్లిక్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, రెస్టారెంట్, బ్యాంక్, ఏఐ కమాండ్ సెంటర్

ఫస్ట్ ఫ్లోర్ : కాన్ఫరెన్స్ హాల్స్

రెండో ఫ్లోర్: సీఆర్‌డీఏ ప్రధానకార్యాలయం

మూడో ఫ్లోర్: అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) కార్యాలయం

నాల్గో ఫ్లోర్: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్(ఎంఏయూడీ) ప్రధాన కార్యాలయం

ఐదు, ఆరు ఫ్లోర్లు: సీఆర్డీఏ(ఏడీసీఎల్) కేటాయింపు

ఏడో ఫ్లోర్: మున్సిపల్ మంత్రి, ఏఎంయూడీ ప్రిన్సిపల్ సెక్రటరి చాంబర్లు

ఇతర శాఖలకు..

ప్రధాన భవనానికి పక్కనే ఎనిమిది ఎకరాల్లో పార్కింగ్ సహ టిడ్కో, ఏపీయూఎఫ్ఐడీసీ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, రెరా అప్పీలేట్ అథారిటీ, గ్రీనింగ్ కార్పొరేషన్, డీటీసీపీ(టౌన్ ప్లానింగ్), రెరా, మెప్మా కార్యాలయాల కోసం మరో నాలుగు భవనాలను నిర్మించారు.

రైతులందరూ ఆహ్వానితులే: మంత్రి నారాయణ

సీఆర్డీఏ కార్యాలయ ప్రారంభోత్సవానికి రాజధాని రైతులందరూ ఆహ్వానితులేనని మంత్రి నారాయణ తెలిపారు. సీఎం ఢిల్లీ పర్యటన ఉండటంతో బహిరంగ సమావేశం ఉండదన్నారు.

ఫైర్ ఎన్‌వోసీల ప్రక్రియ పారదర్శకంగా చేయాలి

● అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ పీవీ రమణ



సమావేశంలో పాల్గొన్న అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ

గుంటూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వివిధ భవన సముదాయాలకు ఫైర్ ఎన్‌వోసీల జారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అగ్నిమాపకశాఖ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ పీవీ రమణ సూచించారు. ఆదివారం ఆయన గుంటూరులో జోనల్ సమీక్ష నిర్వహించారు. సమీక్షకు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, వివిధ శాఖలకు ఎన్‌వోసీలు జారీ చేయడంలో పారదర్శకంగా, నిబంధనలను కచ్చితంగా అనుసరించాలని సూచించారు. ఫైర్ ఎన్‌వోసీ క్లియరెన్స్ కాలపరిమితిని తగ్గించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ఫైర్ స్టేషన్ బిల్డింగ్ వర్క్స్ నిర్మాణాన్ని అన్ని జిల్లాల అధికారులు పర్యవేక్షించాలని, పనుల పురోగతికి నిర్ణీత గడువులోపు సమీక్షించి బడ్జెట్ క్లియరెన్స్ కోసం ప్రధానాధికారికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో అడిషనల్ డైరెక్టర్ సౌత్ జ్ఞాన సుందరం, రీజనల్ ఫైర్ ఆఫీసర్ జిలానీ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అనుమతి లేకుండా బాణాసంచా నిల్వ చేస్తే చర్యలు

● ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపర మైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలో బాణాసంచా విక్రయ, నిల్వ కేంద్రాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తగిన పర్యవేక్షణ ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... బాణాసంచా దుకాణాలు, నిల్వ కేంద్రాలు ప్రభుత్వ అనుమతులతోనే నడపాలని, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి బాణాసంచా దుకాణం వద్ద నీరు, ఇసుక, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, బకెట్లు, ఇతర అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. దుకాణం లేదా నిల్వ కేంద్రం లోపల ధూమపానం, మంటలు లేదా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కి కారణమయ్యే వస్తువులు పూర్తిగా నిషేధించాలన్నారు. మైనర్లు, పిల్లలను విక్రయ కార్యకలాపాలలో నియమించడం పూర్తిగా నిషిద్ధమన్నారు. ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు వెంటనే ఫైర్ సర్వీస్ 101 లేదా డయల్ 112కి సమాచారం ఇవ్వాలన్నారు. విక్రేతలు అగ్నిమాపక విభాగం నుండి అవసరమైన అనుమతులు, భద్రతా సర్టిఫికెట్లు పొందాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో బాణాసంచా విక్రయ, నిల్వ కేంద్రాలపై అనుమతులు, భద్రతా ప్రమాణాల పరిశీలన జరుగుతోందని ఎస్పీ తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా లేదా భద్రతా ప్రమాణాలు పాటించకుండా టపాసులు నిల్వచేస్తే, విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆత్మనిర్భర్ భారత్ సంకల్పమే దేశాభివృద్ధికి పునాది

● బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆత్మనిర్భర్ భారత్ సంకల్పం కేవలం ఒక నినాదం కాదు, అది ప్రతి భారతీయుని జీవిత ధ్యేయంగా మారాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి అన్నారు. లాలుపురం మెయిన్ రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆత్మనిర్భర్ భారత్ కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. కుమారస్వామి మాట్లాడుతూ మన రైతు స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహిస్తేనే భారత దేశం నిజమైన ఆత్మనిర్భర్ భారత్ అవుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ అంటే కేవలం ఒక నినాదం కాదు, ఇది దేశ అభివృద్ధి దిశగా స్వయం ఆధారితకు ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రాజు, బిట్రా శివన్నారాయణ, ఎమ్మెల్సీ పోతుల సునీత, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్సనపు శ్రీనివాస్, సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, రాష్ట్ర ఐటీ కన్వీనర్ మకుటం శివ, పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్, బీజేపీ సీనియర్ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తోన్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పట్టని అధికారులు

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కిరణ్

గుంటూరు (విద్య) అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అధికారులకు సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పట్టవని, విద్యార్థులు వారి సమస్యలు విన్నవించుకున్నా పట్టించుకోరని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ పేర్కొన్నారు. పెదనందిపాడు మండలం అన్నపర్రు బీసీ హాస్టల్ సంఘటనపై ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ ఏడాది జూలై 13వ తేదీన పెదనందిపాడు మండలం అన్నపర్రు బీసీ సంక్షేమ హాస్టల్‌లో సర్వే నిర్వహించామని చెప్పారు. ఆ సమయంలో విద్యార్థులు అనేక సమస్యలను ఎస్ఎఫ్ఐ దృష్టికి తీసుకొచ్చారని, వారి సమస్యలను మరుసటి రోజే జిల్లా గ్రీవెన్స్‌లో పెట్టామని తెలిపారు. అధికారులు వారి సమస్యలు పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని కిరణ్ విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.పవన్ కుమార్, షేక్ సమీర్, నగర సహాయ కార్యదర్శి సుర్జిత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆలోచనల్లో మార్పే నిజమైన విజయం

● మైసూర్ వర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ వెంకటేశ్ కుమార్

గుంటూరు (విద్య) అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి ఆలోచనల్లో మార్పే నిజమైన విజయమని యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.వెంకటేష్ కుమార్ అన్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో "వరల్డ్ మెంటల్ హెల్త్ డే వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి మార్పును గుర్తించగల దృష్టి కలిగి ఉండి, తన విజయానికి తానే అనుమతి ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న వెంకటేష్ కుమార్

ముగిసిన సంగీత, నృత్య ఉత్సవాలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే సంగీత, నృత్య ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. చివరిరోజున కార్యక్రమాలను చిగురపాటి కమల జ్యోతి, రేడియాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ సుజాత, డాక్టర్ జే.నరేష్‌బాబు, విశ్రాంత లెక్చరర్ తిరుపతయ్య ప్రారంభించారు. తొలుత బీవీఎన్. ప్రణతి, వైష్ణవి తదితరులు పాల్గొని పలు వాగ్గేయ కీర్తనలను ఆలపించి సంగీతాభిమానులను అలరించారు. సాయంత్రం పద్మశ్రీ శ్రీనివాసన్, చెన్నై వారి శాస్త్రీయ సంగీత కచేరి శ్రావ్యంగా సాగింది. అనంతరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్ని సన్మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పీ.విజయ, ఎంవై శేషరాణి పర్యవేక్షించారు.



త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తున్న పద్మశ్రీ శ్రీనివాసన్

మిర్చి కిరాయి వివాద పరిష్కారానికి ఎమ్మెల్యే మాధవి చొరవ

● ఇరుపక్షాలతో సుదీర్ఘ చర్చలు

● వారంలో ప్రతిపాదనలతో రావాలని సూచన

గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో లారీ యజమానులు, ఎగుమతిదారుల మధ్య కొనసాగుతున్న కిరాయి వివాదాన్ని పరిష్కరించేందుకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి చొరవ తీసుకున్నారు. ఈ వివాదం కారణంగా వ్యాపారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆదివారం ఆమె తన కార్యాలయంలో ఇరుపక్షాలను పిలిపించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ, గుంటూరు మిర్చియార్డు రాష్ట్ర వ్యవసాయ ఆర్థికానికి వెన్నెముక అని, ఇక్కడ వ్యాపారం దెబ్బతింటే వేల కుటుంబాలు ప్రభావితం అవుతాయని అన్నారు. అందుకే ఎవరూ రాజకీయ కోణంలో కాకుండా పరస్పర అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం వ్యాపారులకూ, లారీ యజమానులకూ సమాన ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. చర్చల ద్వారా అందరికీ అనుకూలంగా పరిష్కారం కనుగొంటామన్నారు. ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా, రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడకుండా సజావుగా వ్యాపారం సాగడానికి ఇరుపక్షాలు సహకరించాలన్నారు. వారం సమయం తీసుకుని పరస్పర చర్చల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు అందజేయాలని సూచించారు.

ఈ చర్చలలో మిర్చి ఎగుమతిదారులు జుగిరాజ్ భండారి, తోట రామకృష్ణ, కొత్తూరి సుధాకర్, లారీ యజమానుల తరుపున ఈ శ్రీనివాస్, కె.వేమారెడ్డి, ఎస్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



మిర్చి ఎగుమతిదారులు, లారీ యజమానులతో చర్చిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

రాత్రి వేళ అనవసరంగా రోడ్లపై తిరిగే వారిపై ప్రత్యేక డ్రైవ్

● కేసులు నమోదు... చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

● జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



రాత్రివేళ తిరుగుతోన్న యువకులను ప్రశ్నిస్తోన్న పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, సిబ్బంది

గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరిగే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రాత్రివేళ అనవసరంగా రోడ్లపై తిరిగేవారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రాత్రి సమయాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, అనవసరంగా రోడ్లపై తిరుగుతూ ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. "టౌన్ న్యూసెన్స్ యాక్ట్" ప్రకారం మొత్తం 106 మందిపై 104 కేసులు నమోదు చేసి, వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, రాత్రి వేళల్లో జరిగే చట్టవ్యతిరేక చర్యలను నిరోధించడం ఈ ప్రత్యేక డ్రైవ్ ఉద్దేశ్యం అన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ... "మద్యం సేవించి రాత్రి వేళల్లో రోడ్లపై తిరగడం వలన గొడవలు, అల్లర్లు, దొంగతనాలు, ఇతర నేరాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు రాత్రి సమయాల్లో అనవసరంగా బయట తిరగరాదన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి,కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీ విధులను బలోపేతం చేసి, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో సంచరిస్తున్న అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి విచారణలు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్స్ ఉన్నవారు ఏవైనా సంఘటనల్లో పాల్గొంటే, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. మీ ప్రాంతంలో రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నవారు గానీ, ప్రజా శాంతికి భంగం కలిగించే వ్యక్తులు గానీ కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 నంబర్‌కి సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేసారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లా పోలీస్ బృందం రాత్రి గస్తీని మరింత ముమ్మరం చేసి, జిల్లా ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని ఎస్పీ తెలిపారు.



రాత్రి వేళ అనవసరంగా తిరుగుతున్న వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇస్తున్న కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి

104 ఉద్యోగులకు బకాయి వేతనాలు చెల్లించాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 104 మొబైల్ మెడికల్ యూనిట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికి బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. పాత సంస్థ అరబిందో సర్వీస్ ప్రొవైడర్ నుంచి రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గోరంట్ల సురేశ్‌కుమార్ అధ్యక్షత వహించారు. లక్ష్మణరావు మాట్లా డుతూ, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల పెంపు జరగాలని అన్నారు. అవసరమైన బఫర్ సిబ్బందిని అన్ని జిల్లాల్లోనూ నిబంధనలకు అనుగు ణంగానే నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరి శ్రీహర్ష, ఐ.నాగులు, బాలకృష్ణ, సత్యరాజు, సుబ్బారావు, అమర్చంద్, సూర్యనారాయణ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణరావు, పాల్గొన్న 104 ఉద్యోగులు

కే-ర్యాంప్ చిత్రాన్ని ఆదరించండి

● హీరో కిరణ్ అబ్బవరం



మాట్లాడుతున్న కథానాయకుడు కిరణ్ అబ్బవరం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీన విడుదల కానున్న కే-ర్యాంప్ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించి, విజయవంతం చేయాలని ఆ చిత్ర కథానాయకుడు కిరణ్ అబ్బవరం కోరారు. సినిమా ప్రచారంలో భాగంగా ఆదివారం గుంటూరుకు వచ్చిన ఆయన కాసేపు విలేకరులతో ముచ్చటించారు. కే-ర్యాంప్ కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రమని, పేరుకు తగ్గట్టుగానే అందరినీ అలరిస్తుందన్నారు. ఈ సినిమాలో హాస్యం బాగా పండిందని ప్రేక్షకులకు తప్పక నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ దీపావళికి కుటుంబంతో కలిసి థియేటర్లలో మనస్ఫూర్తిగా నవ్వుకోవచ్చని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాల్లో నటించి సినీ అభిమానులను అలరిస్తానని కిరణ్ అబ్బవరం తెలిపారు.

పొత్తూరులో మహిళ అనుమానాస్పద మృతి

గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధి లోని పొత్తూరులో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో మునికి సింగమ్మ (55) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సింగమ్మది హత్యగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సింగమ్మ భర్త శ్రీనివాసరావు గతంలోనే మృతి చెందారు. పొత్తూరు లోని చెరువు కట్టపై సింగమ్మ నివాసం ఉంటుంది. ఆమెకు రెండు పోర్షన్ల ఇల్లు ఉంది. ఒక పోర్షన్లో సింగమ్మ ఉంటుండగా మరో పోర్షన్‌ను అద్దెకిచ్చింది. ఆదివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో సింగమ్మ మృతి చెంది ఉండడంతో గమనించిన స్థానికులు 112కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. నల్లపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పొత్తూరులో నివాసం ఉంటున్న సింగమ్మ మనవడిపై స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న నల్లపాడు ఎస్ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ద్వారా సింగమ్మ మృతికి కారణాలు వెల్లడి కానున్నాయని పోలీసులు తెలిపారు.

8 మంది జూదరుల అరెస్టు

గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పట్టాభిపురంలో ఓ ఇంటిలో 8 మంది పేకాటరాయుళ్ళను పోలీసులు అరెస్టు చేశారు. ఓ ఇంటిలో పేకాడుతున్నారని అందిన సమాచారం మేరకు సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. వారి నుంచి రూ.41 వేల 700 నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

వైద్య కళాశాలల పీపీపీ మోడల్‌పై చర్చకు సిద్ధమా

● వైసీపీకి బీజేపీ నేతల సవాల్

గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలలను పీపీపీ మోడల్‌లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయాలని తీసుకొన్న నిర్ణయంపై విమర్శలు చేస్తోన్న వైసీపీ నేతలు బహిరంగ చర్చకు రావాలని బీజేపీ నాయకులు సవాలు విసిరారు. ఆదివారం మధ్యాహ్నం బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నేతలు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ రాజ్ మాట్లాడుతూ గత పాలకులు అవినీతికి పాల్పడటం, అధికారం కోసం ఏ పని అయినా చేయడం, నేర మయ రాజకీయాలు చేస్తూ వచ్చారన్నారు. పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని షర్మిలా అంటున్నారు. ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే ఆరోగ్యశ్రీ అప్పుడు, ఇప్పుడు అమలు చేస్తున్నారు. నిర్వీర్యం చేసినట్లు చెప్పడం సత్యదూరమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, బిట్ర శివన్నారాయణ, చిగురుపాటి కుమారస్వామి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నార్త్ ప్యారిస్ చర్చికి పీసీసీ సభ్యుల ఎన్నిక

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏఈఎల్‌సీ నార్త్ ప్యారిస్ చర్చికి 14 మంది పీసీసీ సభ్యులను ఎన్నుకున్నట్లు రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఎస్ ఏజే బాబురావు తెలిపారు. జాలాది చిత్తరంజన్, బోరుగడ్డ రత్నాకర్, మేళం రమేశ్ కుమార్, పెండెం రతన్, పేర్లి సందీప్, వి.పుల్లారావు, రాజేశ్, సునీల్, మరియదాస్, సతీశ్, ప్రేమ్ కుమార్, సుధాకర్, దేవదానం, బాబును పీసీసీ సభ్యులుగా ఎన్నికయ్యారని చెప్పారు. ఏఈఎల్‌సీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ మోజేస్, ఏసి కళాశాల ప్రిన్సిపల్ కె.మోజేస్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారని తెలిపారు.



మాట్లాడుతున్న ఫాదర్ ఎస్‌జే బాబురావు

అన్నపర్రు బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

పెదనందిపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అన్నపర్రు బీసీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. మండల పరిధిలోని అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో కల్తీ ఆహారం తిని 54మంది విద్యార్థులు ఆసుపత్రి పాలైన విషయం విదితమే. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పూర్తిస్థాయి విచారణ జరిపిన కలెక్టర్ అన్సారియా బాధ్యుడైన వార్డెన్ నిశ్శంకర మార్కండేయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

దుగ్గిరాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో బెల్టుషాపు నిర్వహిస్తున్న సమాచారంతో నిఘా వేసి, గ్రామానికి చెందిన మేడికొండ చినబాబును ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని ఎనిమిది క్వార్టర్ సీసాల మద్యం, రెండు బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరవి తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలి

● జేసీ అశుతోష్ శ్రీవాస్తవా

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రజలు, అధికారులు అవగాహన పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ కోరారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆదివారం ఫోరమ్ ఫర్ ఆర్‌టీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈమని హనుమంతరావు ఆధ్వర్యంలో స్థానిక లాడ్జి సెంటర్ నుంచి అరండల్‌పేట పోలీస్ స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రజలు తమకు కావలసిన సమాచారాన్ని రాబట్టటం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 12 అక్టోబరు 2005న సమాచార హక్కు చట్టం తెచ్చిందని వివరించారు. డొక్కా మాణిక్యవరప్రసాదు మాట్లాడుతూ సమాచారంతోనే హక్కుల సాధించవచ్చని అన్నారు. అనంతరం సమాచారం హక్కు చట్టంపై యూటీఎఫ్ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమిషనర్ శామ్యూల్ జోనాథన్, కొండా శివరామిరెడ్డి, కొరివి వినయ్‌కుమార్, విల్సన్, డాక్టర్ ఎం.సుధ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవా, పాల్గొన్న మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు తదితరులు

సమాజాభివృద్ధికి బాలికల సాధికారతే పునాది

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధికి బాలికల సాధికారతే పునాదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. నియోజకవర్గంలో ఆదివారం ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఏసీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం 'మానవతా' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాల, బాలికలకు ఎన్ఎంఎంఎస్-2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, బాలిక ఒక కుటుంబానికి మాత్రమే కాదు, దేశానికే గర్వకారణమని అన్నారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి అని చెప్పారు. విద్యాసంస్థల్లో బాలికల హాజరు పెరుగుతుండటం, క్రీడలు, సైన్స్ టెక్నాలజీ రంగాల్లో వారి ప్రతిభ వెల్లివిరియటం సంతోషకరమైన విషయమని మాధవి పేర్కొన్నారు.



మానవతా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గ్యార్మీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

18వ డివిజన్‌లోని మొహిద్దీన్ పాలెం దర్గా వద్ద జరిగిన గ్యార్మీ వేడుకల్లో ఎమ్మెల్యే గల్లా మాధవి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం 20వ డివిజన్ సీనియర్ నాయకుడు షేక్ హుస్సేన్ కుమారుడి వలీమా వేడుకకు హాజరై నూతన వధూవరులకు మొక్కను బహూకరించి ఆశీస్సులు అందించారు.




షేక్ బుడే, గూడవల్లి నాగేశ్వరరావులను సత్కరిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

సీనియర్ నాయకులకు ఘన సత్కారం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్రాడీపేట సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శతవసంతాల కమ్యూనిస్టు ఉద్యమంలో విరబూసిన ఎర్రమందారాల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని, కమ్యూనిస్టు ఉద్యమం శతవసంతాల విజయగాథను స్మరించారు. అనంతరం 95 ఏళ్ల వయసులో పార్టీ ఆలోచనల పట్ల అచంచలమైన విశ్వాసంతో ఉన్న కామ్రేడ్ షేక్ బుడే, కామ్రేడ్ గూడవల్లి నాగేశ్వరరావును ఆయన ప్రత్యేకంగా సన్మానించారు.

గుంటూరు, జిల్లా కేంద్రంగా విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో అడుగుపెట్టి అనేక పోరాటాలకు తమ జీవితాన్ని అంకితం చేసిన సీనియర్ కామ్రేడ్ల సేవలను నారాయణ గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నగర పార్టీ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - 2026

ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - 2026 కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే, టెలికాం, డిఫెన్స్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోని ఇంజనీరింగ్ పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు. ఇంజనీరింగ్ సర్వీసులో సివిల్స్ లాంటి పోస్టులు ఇవి.

ఖాళీలు 474

UPSC

విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్

విద్యార్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ తదితర అర్హతలు ఉండాలి.

వయస్సు: 2026 జనవరి 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక విధానం: స్టేజ్ - 1 ప్రిలిమినరీ పరీక్ష, స్టేజ్-2లో మెయిన్ పరీక్ష ఉంటుంది. స్టేజ్-3లో ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్ ఉంటుంది. తరువాత మెడికల్ ఎగ్జామినేషన్ కూడా ఉంటుంది.

ప్రిలిమినరీ పరీక్ష: రెండు ఆబ్జెక్టివ్ టైప్(మల్టిపుల్ చాయిస్) తరహా ప్రశ్న పత్రాలు ఉంటాయి. ఇవి 500 మార్కులకు ఉంటాయి. ఇందులో 200 మార్కులకు పేపర్-1 ఉంటుంది. దీనిని రెండు గంటల్లో పూర్తి చేయాలి. 300 మార్కులకు పేపర్-2 ఉంటుంది. వ్యవధి మూడు గంటలు. ఇందులో కోర్ ఇంజనీరింగ్ సబ్జెక్టులపై ప్రశ్నలు ఉంటాయి. అలాగే నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

మెయిన్స్ పరీక్ష: ఇది పూర్తిగా డిస్క్రిప్టివ్ పరీక్ష. ప్రిలిమ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన వారిలో 1:6 లేదా 1:7 మందిని మెయిన్స్‌కు పిలుస్తారు. అంటే యావరేజీగా 2844 నుంచి 3318 మందికి మెయిన్స్ రాసే అవకాశం లభించవచ్చు. ఇందులో కూడా రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపరుకు 300 మార్కులు. ఇవి పూర్తిగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పేపర్లు. ఒక్కో పేపర్ వ్యవధి మూడు గంటలు.

ఇంటర్వ్యూ: చివరగా ఇంటర్వ్యూ ఉంటుంది. దీనికి 200 మార్కులు కేటాయించారు. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. దీనిలో అభ్యర్థుల ఆలోచించే తీరు, తెలివి తేటలు, నాయకత్వ లక్షణాలను పరిశీలిస్తారు.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 16

ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 2026 ఫిబ్రవరి 8

మెయిన్స్ పరీక్ష: 2025 జూన్ 21

వెబ్‌సైట్: https://upsconline.nic.in/

దిక్సూచి

నవోదయ విద్యాలయాల దరఖాస్తు గడువు అక్టోబర్ 21

జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో 9వ, 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి(లేటర్ ఎంట్రీ)కి దరఖాస్తుల గడువు 2025 అక్టోబర్ 21. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ఆధునిక విద్యను అందించడం జేఎన్‌వీల ముఖ్య ఉద్దేశం.

- దేశ వ్యాప్తంగా 653 జేఎన్‌వీలు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు 9 నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తారు. విద్యార్థి తను దరఖాస్తు చేయాలనుకున్న జిల్లా స్థానిక అభ్యర్థి అయి ఉండాలి. ఆయా జిల్లాల్లో 2025-26 విద్యా సంవత్సరాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి, పదో తరగతి చదువుతూ ఉండాలి.

పరీక్ష: మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. రెండున్నర గంటల్లో సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో ఉంటుంది.

పరీక్ష తేదీ: 2026 ఫిబ్రవరి 7

వెబ్‌సైట్: navodaya.gov.in/nvs/en/Home1/


ఇండియన్ రైల్వేల్లో ఉద్యోగాలు

నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్)

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు 8050 ఉద్యోగాలతో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్) సెంట్రలైజ్డ్ ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 5000 పోస్టులు గ్రాడ్యుయేట్, 3050 పోస్టులు అండర్ గ్రాడ్యుయేట్ ఉన్నాయి. గ్రాడ్యుయేట్ పోస్టుల దరఖాస్తులు 2025 అక్టోబర్ 21 నుంచి అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల దరఖాస్తులు 2025 అక్టోబర్ 28 నుంచి ప్రారంభం అవుతాయి. గ్రాడ్యుయేట్ పోస్టుల చివరి తేదీ 2025 నవంబర్ 20, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల చివరి తేదీ 2025 నవంబర్ 27.

- గ్రాడ్యుయేట్ స్థాయి పోస్టులలో గూడ్స్ రైలు మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, స్టేషన్ మాస్టర్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్ వైజర్, ట్రాఫిక్ అసిస్టెంట్ ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్, అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్, జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, రైళ్ల క్లర్క్ ఖాళీలు ఉన్నాయి.

వయస్సు: గ్రాడ్యుయేట్ పోస్టులకు 18 నుంచి 33, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు 16-33 ఏళ్ల లోపు ఉండాలి. జోన్లు, విభాగాల వారీగా ఖాళీలతో నోటిఫికేషన్ త్వరలో వెలువడుతుంది.



జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్

భారతీయ రైల్వే 2570 పోస్టులతో మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే డివిజన్లలో ఉన్న కింద పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు దరఖాస్తులను కోరుతోంది.

పోస్టులు: జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్.

(పూర్తి వివరాలతో నోటిఫికేషన్ త్వరలో వెలువడుతుంది. దీని కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌ను తరచూ చెక్ చేసుకుంటూ ఉండాలి.)

వయస్సు: అభ్యర్థుల వయస్సు 2026 జనవరి 1 నాటికి 18-33 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తులు ప్రారంభం: 2025 అక్టోబర్ 30

చివరి తేదీ: 2025 నవంబర్ 30

రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, సికింద్రాబాద్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువహటి, గోరఖ్‌పూర్, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబాయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సిలిగురి, తిరువనంతపురం.

వెబ్‌సైట్: https://rrbsecunderabad.gov.in/



ఢిల్లీ పోలీస్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 509

ఢిల్లీ పోలీస్ విభాగంలో 509 హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా ఆసక్తిగల స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు:

- హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్) మేల్: **341**
- హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్) ఫీమేల్: **168**

వయస్సు: 2025 జూలై1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10 ఏళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్

చివరి తేదీ: 2025 అక్టోబర్ 20

పరీక్ష తేదీ: 2025 డిసెంబర్/ 2026 జనవరి

వెబ్‌సైట్: https://ssc.gov.in

జర్నలిజం కోర్సులో అడ్మిషన్లు

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో 2025-26 సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో అందించే ఈ కోర్సులు అభ్యర్థులు తమ ఆసక్తిని బట్టి రెగ్యులర్, కరస్పాండెన్స్ పద్ధతిలో చదవవచ్చు.

- **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఏడాది. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్
- **డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆరు నెలలు. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్
- **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆరు నెలలు. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్
- **సర్టిఫికెట్ కోర్స్ ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి మూడు నెలలు. కనీసం విద్యార్హత పదో తరగతి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 18

ఫోన్: 98485 12767, 7286013388

వెబ్‌సైట్: www.apcj.in

AP COLLEGE OF JOURNALISM

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సెన్సార్ పూర్తి




సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా' సెన్సార్ పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సిద్ధు సరసన శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా కథానాయికలుగా నటించారు. ఈనెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మోగ్లీ రాక ఖరారు



రోషన్ కనకాల కథానాయకుడిగా సందీప్ రాజ్ తెరకెక్కిస్తోన్న 'మోగ్లీ 2025' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తోన్న ఈ చిత్రం డిసెంబరు 12న విడుదల కానుంది. ఇప్పటికే నాని వాయిస్ ఓవర్‌తో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. రోషన్ సరసన సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయికగా నటిస్తున్నారు. బండి సరోజ్ కుమార్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ, కాల భైరవ సంగీతం అందిస్తున్నారు.

అఖండ 2కు మరో ఆకర్షణ





బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అఖండ' చిత్రానికి ఇది కొనసాగింపు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అఖండ' చిత్రానికి బాలకృష్ణ నటనతో పాటు తమన్ నేపథ్య సంగీతం సైతం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకొంది. ఇప్పుడు మరోసారి 'అఖండ 2' కోసం తమన్ రంగంలోకి దిగారు. ఇటీవలే ఆయన ఈ చిత్రం బ్యాగ్రౌండ్ స్కోర్‌ను ప్రారంభించారు. సంస్కృత శ్లోకాలను అద్భుతంగా పఠించే నైపుణ్యంతో ప్రసిద్ధి చెందిన పండిట్ శ్రవణ్ మిశ్రా, పండిట్ అతుల్ మిశ్రా సోదరులు ఇద్దరూ నేపథ్య సంగీతం కోసం తమ అద్భుతమైన గాత్రంతో సంస్కృత శ్లోకాలను, వేద మంత్రాలను పఠించనున్నారని తమన్ తెలిపారు. వారితో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఈ చిత్రంలో సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి విలన్ పాత్ర పోషిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలకపాత్రలో కనిపించనున్నారు.

అంచనాలు రెట్టింపు



రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు పి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ టీజర్‌ని రిలీజ్ చేశారు. సినిమాలను, ఆంధ్ర కింగ్‌ను ఆరాధించే పాత్రలో రామ్ ఒదిగి పోయారు. రామ్ తల్లిదండ్రులుగా రావు రమేశ్, తులసి బాగా నటించారు. ఆసక్తికర సంభాషణలతో మురళీ శర్మ ఆకట్టుకున్నారు. కాగా, ఈ చిత్రంలో ఉపేంద్ర ఆన్ స్క్రీన్ సూపర్ హీరోగా కనిపించనున్నారు. మొత్తానికి టీజర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.

శ్రీకాంత్ అయ్యంగార్ క్షమాపణలు



మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్.. ఆదివారం సోషల్‌మీడియా వేదికగా క్షమాపణలు తెలిపారు. ఇటీవల నేను చేసిన కొన్ని వ్యాఖ్యలు మీ మనోభావాలను దెబ్బతీశాయి. అది నా ఉద్దేశం కాదు. మిమ్మల్ని బాధపెట్టినందుకు క్షమాపణలు. అలాగే, మన దేశానికి స్వాతంత్ర్యం అందించడం కోసం పాటుపడిన మహావీరులందరికీ మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేస్తున్నాను. జై హింద్ అని పేర్కొన్నారు.

శ్రీకాంత్‌పై 'మా'లో ఫిర్యాదు

మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు శ్రీకాంత్ అయ్యంగార్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇటీవలె సైబర్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరిన సంగతి తెలిసిందే. ఆదివారం ఆయన మా (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణుకు శ్రీకాంత్‌పై ఫిర్యాదు చేశారు. 'భావ ప్రకటన స్వేచ్ఛ అనేది అందరికీ ఈ కాలంలో ఓ ఫ్యాషన్‌గా మారిపోయింది. 'మా' క్రమశిక్షణ కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటాం' అని 'మా' జనరల్ సెక్రటరీ శివబాలాజీ అన్నారు.

అట్టహాసంగా ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానోత్సవం

గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. 'లాపతా లేడీస్' ఉత్తమ చిత్రంగా పురస్కారం అందుకుంది. అత్యధికంగా 13 అవార్డులు దక్కించుకుని సత్తా చాటింది. ఆ సినిమాను తెరకెక్కించిన కిరణ్‌రావు ఉత్తమ దర్శకురాలుగా అవార్డును స్వీకరించారు. 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తిక్ ఆర్యన్, 'ఐ వాంట్ టూ టాక్' చిత్రానికిగాను అభిషేక్ బచ్చన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. 'జిగ్రా' సినిమాకు గాను ఉత్తమ నటిగా ఆలియా భట్ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమానికి షారుక్ ఖాన్, కరణ్ జోహార్, మనీష్ పాల్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. 17 ఏళ్ల తర్వాత షారుక్ ఈ వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించడం విశేషం. కాజోల్‌తో కలసి స్టెప్పులేసి అందర్నీ ఆకట్టుకున్నారు. తన ప్రదర్శనతో జీనత్ అమన్‌కు నివాళినిచ్చారు కృతిసనన్.





షారుక్ ఖాన్, కాజోల్



నితాన్షీ గోయెల్



ప్రతిభ



ఆలియ భట్

అవార్డులు అందుకున్న మరికొందరి వివరాలు

- **ఉత్తమ నటుడు (క్రిటిక్స్ ఛాయిస్):** రాజ్‌కుమార్ రావు (శ్రీకాంత్)
- **ఉత్తమ నటి (క్రిటిక్స్ ఛాయిస్):** ప్రతిభ (లాపతా లేడీస్)
- **ఉత్తమ సహాయ నటుడు (క్రిటిక్స్ ఛాయిస్):** రవి కిషన్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ సహాయ నటి (క్రిటిక్స్ ఛాయిస్):** ఛాయా కదమ్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ చిత్రం:** ఐ వాంట్ టూ టాక్ (సూజిత్ సర్కార్)
- **ఉత్తమ పరిచయ నటుడు:** లక్ష్య (కిల్)
- **ఉత్తమ పరిచయ నటి:** నితాన్షీ గోయెల్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ స్క్రీన్‌ప్లే:** నేహా దేశాయ్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ కథ:** ఆదిత్య ధర్, మోనాల్ థాక్కర్ (ఆర్టికల్ 370)

నటి డయాన్ కీటన్ కన్నుమూత



ఆస్కార్ విజేత, హాలీవుడ్ దిగ్గజ నటి డయాన్ కీటన్(79) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం తుదిశ్వాస విడిచారు. దాదాపు ఐదు దశాబ్దాలు తన నట జీవితాన్ని కొనసాగించిన ఆమె హాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆమె నటించిన 'అనీ హాల్' సినిమాకు ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డును అందుకున్నారు. 'ది గాడ్‌ఫాదర్' సిరీస్ ఆమెకు గ్లోబల్ స్టార్‌డమ్‌ని తెచ్చిపెట్టింది. డయాన్ ధరించిన ప్రత్యేకమైన సూట్లూ, టోపీలు ఫ్యాషన్ ప్రపంచంలో ఓ కొత్త ఒరవడిని సృష్టించాయి.

ఆలోచింపజేసే చిత్రం



రోహిణి హట్టంగడి, రోహిణి ముల్లేటి, సముద్రఖని, హిమాంశు పోహూరి, సౌమ్య, అనన్య నన్నపనేని ప్రధాన పాత్రధారులుగా అక్కినేని కుటుంబరావు తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఒక మంచి ప్రేమ కథ'. హిమాంశు పోహూరి నిర్మాత. ఈ మూవీకి కథ, మాటలు, పాటల్ని ఓల్గా అందించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ విడుదల వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. చిత్ర దర్శకుడు అక్కినేని కుటుంబరావు మాట్లాడుతూ 'కోట్లు సంపాదించేందుకు పరుగులు పెడుతున్నారు. కానీ తల్లిదండ్రుల్ని పట్టించుకోవడం లేదు. అందరిలోనూ ఆలోచనను రేకెత్తించేలా ఈ సినిమాను తెరకెక్కించాను. ఎక్కడా బోర్ కొట్టించకుండా నవ్విస్తూ, ఏడ్పించేలా సినిమా తీశాను' అని అన్నారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ 'పెద్దవాళ్లందరూ కలిసి నటించిన చిత్రమే అయినా ఇది యువతరానికి సంబంధించిన కథ' అని చెప్పారు. నిర్మాత హిమాంశు పోహూరి మాట్లాడుతూ 'సినిమా అద్భుతంగా వచ్చింది. ప్రతీ ఒక్కరికి నచ్చుతుంది' అని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నటి రోహిణి హట్టంగడి, నటి రోహిణి ముల్లేటి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షకుడి కథ



మాస్టర్ మహేంద్రన్, అంబికావాణి ప్రధాన పాత్రధారులుగా వైకుంఠ్ బోను తెరకెక్కిస్తోన్న చిత్రం 'వసుదేవసుతం'. రెయిన్‌బో సినిమాస్ బేనర్‌పై ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ని కథానాయకుడు సత్యదేవ్ ఆవిష్కరించారు. 'ఈ కథ.. ధర్మానికి అడ్డొస్తే..మేనమామ అయినా, లక్షల బంధుగణమైనా, ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా...ధర్మ హింస తథైవచ అన్న శ్రీకృష్ణుడిదే కాదు. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణహోమానికైనా ఎదురెళ్లే ఓ యువకుడిది ' అనే శక్తిమంతమైన సంభాషణలతో ప్రారంభమైన టీజర్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి డీఓపీ : జిజ్జు సన్నీ, సంగీతం: మణిశర్మ.

దీపావళి షాపులకు పర్మిషన్లు తప్పనిసరి


సీఐ కే వాసు

తాడికొండ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించు కొని టపాసుల షాపులను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు తప్పనిసరిగా పర్మిషన్లు తీసుకోవాలని తాడికొండ సీఐ కే వాసు తెలిపారు. ఆదివారం తాడి కొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడికొండ గ్రామంలో దీపావళి షాపులు ఏర్పాటు చేసుకునే వారు స్థానికంగా ఉన్న శ్రీవెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాల (ఎస్‌వీవీ హై స్కూల్) గ్రౌండ్‌లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాల యాజ మాన్యంతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్య లేకుండా విద్యుత్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. షాపుల నిర్వాహ కులు దుకాణాల ముందు ఇసుక, నీళ్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. షాపుల మధ్య గ్యాప్ ఎక్కువగా ఉండే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.


కంతేరులో వాసిరెడ్డి జయరామయ్య తోటలో టీడీపీ శ్రేణులతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

వాసిరెడ్డిని పరామర్శించిన
కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

తాడికొండ(కంతేరు), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కంతేరు సొసైటీ అధ్యక్షుడు వాసిరెడ్డి జయరామయ్యను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని పరామర్శించారు. ఆదివారం తాడికొండ మండలం కంతేరు గ్రామంలోని వాసిరెడ్డి జయరామయ్య తోటను సందర్శించారు. ఇటీవల కాలంలో జయరామయ్య అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న పెమ్మసాని ఆయనను పరామర్శించారు. అనంతరం జయరామయ్యతో కలిసి తోటలో ఆయన కలియతిరిగారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి ముచ్చటించారు. పార్టీకి కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కంతేరు గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాకుమానులో ఆకతాయిల ఆగడాలు

కాకుమాను, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కాకుమానులో ఆకతాయిలు చెలరేగిపోతున్నారు. పుసులూరు వెళ్లే రహదారిలో ఉన్న రైతు సేవా కేంద్రం కిటికీ అద్దాన్ని ఇటీవల పగులకొట్టారు. ఆకతాయిల ఆగడాలతో ఆ ప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. అక్కడే రైతు సేవాకేంద్రంతో పాటు గ్రామ వార్డు సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు కూడా ఉన్నాయి. గతంలో సచివాలయం వద్ద మద్యం తాగేవారు. తాజాగా వారి ఆగడాలు ప్రభుత్వ కార్యాలయాల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఇకనైన పోలీసు శాఖ అధికారులు ఆ ప్రాంతాలపై నిఘా పెంచాలని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులతో పాటు, ఆ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.


జాతీయ రహదారిపై బోల్తా పడ్డ పామాయిల్, కూరగాయల లోడు లారీలు

జాతీయ రహదారిపై రెండు లారీలు బోల్తా

● ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ప్రత్తిపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చినకోండ్రుపాడు వద్ద జాతీయ రహదారిపై ఓవర్ టేక్ చేయబోయి లోడుతో ఉన్న రెండు లారీలు ఢీ కొని బోల్తా పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. కోలార్ నుంచి భువనేశ్వర్‌కు కూరగాయల లోడుతో వెలుతున్న లారీ నెల్లూరు నుంచి అనకాపల్లికి పామాయిల్ లోడుతో వెలుతున్న లారీని ఓవర్ టేక్ చేయబోయే క్రమంలో ఢీ కొన్నది. వేగంగా వెళ్తుండటంతో రెండు లారీలు హైవేలో బోల్తా పడ్డాయి. అయితే లారీలో ఉన్న డ్రైవర్‌తో పాటు క్లీనర్‌లకు స్వల్ప గాయలు మాత్రమే అయ్యాయి. ఇక్కడి పరిస్థితిని గుంటూరు సౌత్ డీఎస్పీ భానోదయ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్తిపాడు ఎస్‌ఐ నరహరి మరో రోడ్డులోకి మళ్లించి లారీలను పక్కకు తీయించారు.

మంత్రి లోకేశ్ చొరవతో బాగుపడిన పాఠశాల మైదానం


నాడు నీటితో నిండిన పాఠశాల మైదానం


నేడు గ్రావెల్ వేసి అభివృద్ధి చేసిన పాఠశాల మైదానం

● సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి చేయించిన లోకేశ్

తాడేపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కొలనుకొండ లోని డిపెప్ ప్రాథమిక పాఠశాల మైదానం నిత్యం నీళ్లతో నిండి విద్యార్థులు ఆడుకోవడానికి అవకాశం లేకుండా ఉండేది. ఇందుకు సంబంధించి మైదా నం ఫొటోలు మంత్రి నారా లోకేశ్‌కు వాట్సాప్ ద్వారా పాఠశాల ప్రతినిధి బృందం పంపించారు. అంతే కాకుండా గ్రామ పెద్దలు కంచర్ల రంగారావు, సామల నాగేశ్వరరావు, నూతక్కి నాగేశ్వరరావులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కార్యాలయంలో తెలియజేయగా స్పందించిన మంత్రి లోకేశ్ తన సొంత నిధులతో పాఠశాల మైదానం మొత్తం గ్రావెల్‌తో నింపి విద్యార్థులకు ఆడు కునేందుకు యోగ్యమైనదిగా తయారు చేయించారు. మంత్రి లోకేశ్ చొరవను ఎంఈవో-1 శాంతకుమారి, ఎంఈవో-2 నాగేశ్వరరావు, డిపెప్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పి.యోగి తాహూర్ల, ఉపాధ్యాయులు, అభినందించి కృతజ్ఞ తలు తెలిపారు.

చదువుతోనే జీవితానికి పరమార్థం

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని
● రు.2కోట్లతో జడ్పీ పాఠశాల భవన నిర్మాణం


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

పెదనందిపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): చదువుతోనే జీవితానికి పరమార్థం ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలపరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలో దాత ప్రవాసాంధ్రుడు డాక్టర్ చిమటా యుగంధర్, సీఎస్‌ఆర్ నిధులతో మాకినేని రామయ్య జిల్లాపరిషత్ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవాడిని ప్రపంచానికి పరిచయం చేసేది చదువేనన్నారు. రాబోయే తరాలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని దాతలు మాకినేని వీరయ్య స్థలం అందించగా మాకినేని రామయ్య 1955లో భవన నిర్మాణం చేపట్టారని ఈ పాఠశాలలో మాజీ మంత్రి మాకినేని, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణతో పాటు 500మంది ఇక్కడ విద్యనభ్యసించి వివిధ దేశ, రాష్ట్ర ఉన్నత స్థానాల్లో ఉండడం హర్షణీయమన్నారు. నూతన భవనానికి చేయూతనందించిన ప్రవాసాంధ్రుడు చిమటా యుగంధర్‌ప్రసాద్ తన సొంత గ్రామంలో తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా ఊరికి, చదువుకున్న పాఠశాలకు సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఈప్రాంతంలో విద్యావంతులైన ఎంపీ పెమ్మసాని ఉండటం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టమని, ఆయన చొరవతో పార్లమెంట్ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, ఈ పాఠశాల భవన నిర్మాణం కూడా ఆయన చొరవేనన్నారు. దాత బంధువైన కొమ్మినేని సత్యనారాయణతో పాటు వివిధ రంగాల్లో విశిష్ట అవార్డులు అందుకున్న పలువురు గ్రామస్థులను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ నిమ్మల శేషయ్య, ఉగ్గిరాల సీతారామయ్య, ఎన్నారై టీడీపీ లాస్‌ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, మండల అధ్యక్షుడు కోడూరి రాంబాబు, తెలుగుమహిళ అధ్యక్షురాలు చిన్నం ఈశ్వరమ్మ, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ స్వయంపు పార్వతి, నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి, సర్పంచ్ కృష్ణప్రసాద్, గ్రామ అధ్యక్షుడు మాకినేని శ్రీకాంత్, జనసేన మండల అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర, బీజేపీ అధ్యక్షుడు వెలగా గంగాధర్, పెద్ది సాంబశివరావు, చిమటా రత్నకుమారి, మాకినేని శ్రీనివాసరావు, ఎంఈవో కేఎఫ్ కెనడీ, పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వరరావు పాల్గొన్నారు.

గుంటూరు చానల్‌లో ఈతకు దిగిన వ్యక్తి మృతి

పెదకాకాని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు చానల్‌లో సరదాగా ఈతకొట్టేందు కు దిగిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలానికి చెందిన శ్రీనివాసరావు (35) దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు గ్రామంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానానికి వచ్చా రు. అక్కడి నుంచి తిరిగి స్వగ్రామం బయలుదేరగా మార్గంమధ్యలో నంబూరు గ్రామంలో ఉన్న గుంటూరు చానల్ వద్ద ఆగాడు. గుంటూరు చానల్ ఉధృతంగా ప్రవహిస్తుండటం తో ఈత కొట్టేందుకు దిగాడు. చానల్‌లో నీటమునిగి మృత్యువాత పడ్డాడు. స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీసి వారి స్వగ్రామానికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెదనందిపాడు, అక్టోబరు, 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు-పర్చూరు రహదారిలో ఏబీపాలెం శ్మశనావాటిక వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం కాకుమాను మండలం చినలింగాయపాలెం గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బోయపాలెంలో ఓ ఫంక్షన్‌కు వెళ్తుండగా ఏబీపాలెం శ్మశానవాటిక వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావుకు తలకు, కాలుకు బలమైన గాయాలవడంతో 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

చిగురు బాలల ఆశ్రమంలో పౌష్టికాహారం పంపిణీ

తుళ్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అమరావతి ఉద్యమంలో పనిచేసిన వారు అదే అమరావతిలో కూటమి ప్రభుత్వంలో సేవా కార్యక్రమాలు చేయటానికి నడుం బిగించారు. వెంకటపాలెం చిగురు బాలల ఆశ్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి క్యాపిటల్ సిటీ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని ఆదివారం అందజేశారు. అలాగే ఫ్యాన్‌లు, ఎలక్ట్రికల్ వస్తువులను ఆశ్రమానికి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ వెంకట నరసింహారావు, సెక్రటరీ గుర్రం జయకృష్ణ(చంటి), జొన్నలడ్డ ప్రతీప్, సభ్యులు చింతమనేని అనురాధ, బండ్లమూడి ప్రియంక, ఎర్రగోపు నాగరాజు, కట్ట నరసింహారావు, పరుచూరి కిరణ్ పుట్టి అన్నపూర్ణ ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ స్థాపించి మొదటి సేవా కార్యక్రమం బాలల నుంచి ప్రారంభించాలనే సంకల్పంతో కార్యక్రమం నిర్వహించామని సభ్యులు తెలిపారు.

విద్యార్థులు హాస్టల్‌కు తరలింపు

● అస్వస్థత నుంచి కోలుకున్న విద్యార్థులు
● హాస్టల్‌లో వైద్యసిబ్బంది నియామకం


వైద్యశిబిరం నుంచి హాస్టల్‌కు తిరిగివెళ్లేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

పెదనందిపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్నపర్రు బీసీ బాలుర సంక్షేమ వసతిగృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ప్రత్యేక వైద్యశిబిరంలో వైద్యసేవలు పొందుతున్న 13మంది విద్యార్థులను ఆదివారం తిరిగి వసతిగృహానికి తరలించారు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. మూడురోజులుగా వైద్యుల పర్యవేక్షణలో ఉండి వైద్యసేవలు పొందిన విద్యార్థులు పూర్తిస్థాయిలో కోలుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు వారిని అన్నపర్రు హాస్టల్‌కు తరలించి, హాస్టల్‌లో వైద్యసిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ హేనాప్రియ తెలిపారు.

అన్నపర్రు బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

పెదనందిపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అన్నపర్రు బీసీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. మండల పరిధిలోని అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో కల్తీ ఆహారం తిని 54మంది విద్యార్థులు ఆసుపత్రి పాలైన విషయం విదితమే. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పూర్తిస్థాయి విచారణ జరిపిన కలెక్టర్ అన్సారియా బాధ్యుడైన వార్డెన్ నిశ్శంకర మార్కండేయులును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

కవిత్వం, సాహిత్యంతో సామాజిక చైతన్యం

● తెలుగు సినీ, బుల్లితెర గేయ రచయిత మాలిక్


గోలి మధు రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వివిధ రంగాల ప్రముఖులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యానికి కవిత్వం, సాహి త్యం ఎంతగానో ఉపకరిస్తాయని తెలుగు సినీ, బుల్లితెర గేయ రచయిత మాలిక్ అన్నారు. మంగళగిరికి చెందిన కవి, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు రచించిన ఎదురీత, మధు కవితలపై సాహితీ విమర్శకులు ఎ.రజాహుస్సేన్ విశ్లేషణ చేసిన కాఫీ విత్ గోలి మధు పుస్తకాలను ఆదివారం మంగళగిరిలోని రాయల్ బాంకెట్స్‌లో ఆవిష్కరించారు. రచయిత మాలిక్ మాట్లాడుతూ నేటి రోజుల్లో సమాజం హితం కోసం కోరి రాసే కవుల సంఖ్య చాలా తక్కువగా ఉందని అభిప్రాయపడ్డారు. మధు తన మనస్సులో మాటలను ఎంతో ధైర్యంగా సూటిగా కవిత రూపంలో చెప్పగలిగే సత్తా ఉందని, ఆయన కవితలు సమాజానికి ఎంతో స్ఫూర్తిని అందిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర నాట క కళాసమితి అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, రజాహుస్సేన్, రావి రంగారావు, దామర్ల వెంకట నరసింహం, రేకా కృష్ణా ర్జునరావు, పొట్లాబత్తుని లక్ష్మణరావు, తాటిపాముల లక్ష్మీపెరుమాళ్లు, కంచర్ల కాశయ్య, వల్లభనేని వాణి, దామర్ల కుబేరస్వామి, గాజుల శ్రీనివాసరావు, అల్లక తాతారావు, సందుపట్ల భూపతి, గోలి సౌమ్య, కొతరపు కవిత పాల్గొన్నారు.

పొత్తూరులో మహిళ అనుమానాస్పద మృతి

● హత్య చేసినట్లు స్థానికుల అనుమానాలు

గుంటూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొత్తూరులో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో మునికి సింగమ్మ(55) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సింగమ్మది హత్యగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సింగమ్మ భర్త శ్రీనివాసరావు గతంలోనే మృతిచెందారు. పొత్తూరులోని చెరువు కట్టపై సింగమ్మ నివాసం ఉంటుంది. ఆదివారం రాత్రి సింగమ్మ మృతిచెంది ఉండటంతో గమనించిన స్థానికులు 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నల్లపాడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పొత్తూరులో నివాసం ఉంటున్న సింగమ్మ మనవడిపై స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న నల్లపా డు ఎస్‌ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ద్వారా సింగమ్మ మృతికి కారణాలు వెల్లడి కానున్నాయని పోలీసులు తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

దుగ్గిరాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో బెల్టుషాపు నిర్వహిస్తున్న సమాచారంతో నిఘా వేసి, గ్రామానికి చెందిన మేడికొండ చినబాబును ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని ఎనిమిది క్వార్టర్ సీసాల మద్యం, రెండు బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటరవి తెలిపారు.

మన ఆలోచన మారితే అదే నిజమైన మార్పు

● మైసూర్ వర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ వెంకటేష్ కుమార్


బహుమతులు అందజేస్తున్న వెంకటేష్ కుమార్

గుంటూరు(విద్య), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జీవితంలో ప్రతిసారి బయట మార్పు కనిపించకపోయినా, మన ఆలోచన మారితే అదే నిజమైన మార్పు అని యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ విశ్రాంత ప్రొఫెసర్ జీ వెంకటేష్ కుమార్ తెలిపారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో 'వరల్డ్ మెంటల్ హెల్త్‌డే వారోత్సవాలు' ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ జీ.వెంకటేష్‌కుమార్ మాట్లాడుతూ మార్పును గుర్తించగల దృష్టి కలిగి ఉం డాలి. ప్రతి వ్యక్తి తన విజయానికి తానే అనుమతి ఇవ్వాలి. 'విజయానికి స్వయంగా అనుమతి ఇవ్వడం' ద్వారా మనలోని సామర్థ్యాన్ని వెలికితీయవ చ్చు అని అన్నారు. మరో ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

● దిగువకు 77,025 క్యూసెక్కుల నీటి విడుదల

తాడేపల్లి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 93,776 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 72,025 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 9,544 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు, గుంటూరు చానల్ కాలువకు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


ప్రకాశం బ్యారేజ్ దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరదనీరు

పశ్చిమ డెల్టాకు 7026 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 7026 క్యూసెక్కుల నీరు ఆదివారం విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధి కారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 77,025 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 290 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 1760 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 627 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 201 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 399 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 3080 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

సీఎంసహాయ నిధి చెక్కుల పంపిణీ

దుగ్గిరాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడు తూ వైద్యఖర్చుల నిమిత్తం సాయం కోసం దరఖాస్తు చేసుకున్న బాధితు లకు సీఎం సహాయనిధి నగదు చెక్కులను ఆదివారం అందించారు. పెదపా లెంకు చెందిన బుల్లా రాజేంద్రప్రసాద్‌కు రూ.లక్షా27 వేలు, పెదకొండూరుకు చెందిన మొలబంటి గంగాధర్‌కు రూ.44,014లు నగదు చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి అందించారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, వాసు, సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, ఎంపీటీసీ పుతుంబాక సాయికృష్ణ, నంబూరి బుల్లా రవి, వేమూర తర్నం, కొండేటి నాగేశ్వరరావు యాకోబు, మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్ శిరసాని కిషోర్, మొలబంటి ధనుంజయ, కొం డూరు నరసింహా, దాసరి సురేష్, శుద్ధపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.


పెదపాలెంలో సీఎం సహాయనిధి నగదు చెక్కును బాధితులకు అందిస్తున్న కూటమి నాయకులు



సంతకాల సేకరణ చేపడుతున్న మంగళగిరి కాంగ్రెస్ ఇన్‌చార్జి సలీం, నేతలు

మోదీ హయాంలో ప్రజాస్వామ్య విలువలకు పాతర

● నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ సలీం

మంగళగిరి సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ ఓటర్ల జాబితాలో అవకతవక లకు పాల్పడుతున్నారని మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షేక్ సలీం ఆరోపించారు. ఓటర్ల జాబితాలో అవకతవకలను నిరసిస్తూ కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి సంతకాలను చేపట్టారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ లేని ఓట్లను చేర్చడం, ఉన్న ఓట్లను తొలగించడం వంటి అవకతవకలతో నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారని చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నేతలు రేమిణిశెట్టి హనుమంతరావు, షేక్ సలీమా, సుభానీ, దేశబోయిన మోహనరావు, దేవినేని శ్రీరామమూర్తి, షేక్ జిలానీ, బాషా, సమర్ణకుమార్, అల్లూరి ఆదినారాయణ, కృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి రూ.లక్ష 116 విరాళం



కేఆర్ కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం అభివృద్ధి నిమిత్తం, తెనాలికి చెందిన అమ్మవారి భక్తుడు కొర్ల కృష్ణారావు, రూ.లక్షా 116లను విరాళంగా అందించారు. భక్తుడు కృష్ణారావును దుశ్శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అర్చకుడు తారక్‌నాథ్ చేతులమీదుగా అందించినట్లు ఈవో కోగంటి సునీల్‌కుమార్ తెలిపారు.

- (దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)

తొమ్మిదో తరగతి బాలిక మృతి కేసులో తాత అరెస్టు

● తల్లికి వందనం డబ్బు కోసం మనుమరాలి హత్య

దుగ్గిరాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో మూడు నెలల క్రితం మృతి చెందిన తొమ్మిదో తరగతి బాలిక కొక్కిలిగడ్డ అమూల్య (14) కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగుచూశాయి. బాలిక మృతి కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న ఆమె తాత కొక్కిలిగడ్డ ఏసుపాదాన్ని ఆదివారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించగా.. నెల్లూరు జైలుకు తరలించినట్లు ఎస్సై వెంకటరవి తెలిపారు. ఇటీవల పోలీసులకు అందిన బాలిక పోస్టుమార్టం రిపోర్టులో ఆమె శరీరంపై గాయాలున్నట్లు తేలింది. ఎవరో గట్టిగా కొట్టడంతోనే ఆమె మృతి చెందినట్లు నిర్ధారణ అయింది. ఆ దిశగా పోలీసులు విచారణ జరిపారు. తల్లికి వందనం నగదు కోసం అమూల్య తాతనే ఆమెను కొట్టి చంపినట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది. దాంతో అతన్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తల్లిదండ్రులు విబేధాలతో మూడేళ్లుగా వేరుగా ఉంటుండగా, అమూల్య ఆమె తాత, తండ్రి వద్దే ఉంటోంది. ఈ ఏడాది జూలై 17న అమూల్యకు ఆకస్మాత్తుగా వాంతులవుతున్నాయని, తెనాలి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయినట్లు తల్లికి సమాచారం అందింది. కుమార్తె మృతిపట్ల అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె పోలీసులను ఆశ్రయించగా విషయం బయటపడింది.

వీఆర్‌కు మంగళగిరి రూరల్ సీఐ

మంగళగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఇటీవల హైకోర్టు ఉద్యోగిపై దురుసు ప్రవర్తన, దాడి చేశారనే అభియోగాలపై సీఐ శ్రీనివాసరావుపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆయన్ను వీఆర్‌కు పంపుతూ పోలీసుశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

జగనన్న కాలనీల్లో జూదరుల అరెస్టు


జగనన్న కాలనీలో జూదరులను అదుపులోకి తీసుకుంటున్న ఎస్‌ఐ బాబూరావు, సిబ్బంది

వట్టిచెరుకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవర ప్పాడు గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలో(పెట్రోల్ బంకు ఎదురు) స్పెషల్ బ్రాంచ్ సమాచారంతో ఎస్‌బీఐ సీఐ ఆళ్ల హరి శ్రీనివాస్ ఆదేశాలతో ఎస్‌ఐ బాబూరావు తన సిబ్బందితో ఆదివారం పేకాట ఆడుతున్న ప్రాంతం పై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకొని నాలుగు సెల్ ఫోన్‌లు, మూడు ఆటోలు, 2400 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాబూరావు వెల్లడించారు. అలాగే అనంతవరప్పాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పరదాల మాటున పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపు లోకి తీసుకొని వారి నుంచి ప్లకార్డులు, రూ.360 నగదును స్వాధీనం చేసు కొని పెట్టి కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాబూరావు వెల్లడించారు.

ఫిరంగిపురం కొండపై విత్తన బంతుల వెధ

ఫిరంగిపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి పరిరక్షణ కోసం ఫిరంగి పురంలోని కార్మెల్‌మాత కొండపై శ్రీసాయిరామ్ స్టోన్‌క్రషర్స్ సంస్థ, సిబ్బంది, గ్రీన్ వారియర్స్ బృందం సహకారంతో సుమారు ఐదొందల విత్తన బంతుల ను ఆదివారం వెదజల్లారు. మర్రి, తుమ్మ, తురాయి, సీతాఫలం, రామాఫలం వంటి పర్యావరణానికి మేలు చేసే విత్తనాలను వేశారు. భూమి కోతలను నివారించటం, పచ్చదనం పెంపు, వాతావరణంలోని సమతుల్యతను కాపాడ టం కోసం నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ సందర్భం గా కొండవీడు అసిస్టెంట్ బీట్ అధికారి వెంకటేశ్వరరావు, గ్రీన్ వారియర్స్ ప్రతినిధులు కాకుమాను శౌరి ఫ్రాన్సిస్, జున్ను మాస్టారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ఫిరంగిపురం కొండపై విత్తన బంతులను వెదజల్లుతున్న శ్రీ సాయి రామ్ స్టోన్ క్రషర్స్ సంస్థ, గ్రీన్ వారియర్స్ బృందం

గుంటూరు చానల్‌లో ఈతకు దిగి వ్యక్తి మృతి

పెదకాకాని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు చానల్‌లో సరదాగా ఈతకొట్టేందుకు దిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం నంబూరు గ్రామంలో జరిగింది. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలానికి చెందిన శ్రీనివాసరావు (35) దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు గ్రామంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరిన అతడు మార్గమధ్యంలో నంబూరు గ్రామంలో ఉన్న గుంటూరు చానల్‌లో ఈత కొట్టేందుకు దిగి నీటమునిగి మృతి చెందాడు. స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీసి యడ్లపాడు మండలంలోని వారి స్వగ్రామానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ముగిసిన చెన్నకేశవస్వామి సంప్రోక్షణ

పిట్టలవానిపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలులోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కళాపకర్షణ, కళాన్యాస సంప్రోక్షణ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. సీజీఎఫ్ నిధులతో ఆలయ నవీకరణ కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా 11 మంది వేదపండితులతో మూడురోజులపాటు నిర్విరామంగా యజ్ఞయాగాది హోమ కృతువులు నిర్వహించారు. స్వామివారి కల్యాణ మండప శిఖర ప్రతిష్ఠ అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. దేవస్థానానికి రూ.లక్షా 16 వేలు అందించిన తెనాలికి చెందిన చుక్కపల్లి వెంకట రఘునాథబాబును, తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు, చందోలు పోలీసుస్టేషన్ ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్‌ను ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ యెండూరి సాయిగుప్తా ఘనంగా సత్కరించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలను శ్రీమాన్ వేదాతం కృష్ణమాచార్యులు, వేదాంతం వరదాచార్యులు పర్యవేక్షించారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ది ఏకపక్ష వైఖరి: సీపీఎం

తెనాలి అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ విమర్శించారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం భారతదేశంపై ట్రంప్ సుంకాలు-యుద్ధం, ప్రభావం-పరిశీలన-ప్రత్యామ్నాయం అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారని, ఇతర దేశాల సార్వభౌమాధికారంతో పని లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, భారతదేశాన్ని రెచ్చగొడుతున్నారని చెప్పారు. వ్యవసాయరంగాన్ని దెబ్బతీసేలా ఆయన సుంకాలు విధిస్తున్నారని, ఈ ధోరణిని దేశ ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. స్టాలిన్, నాగేశ్వరరావు, సుబ్బయ్య, హుస్సేన్ వలి, రవికుమార్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష నిర్వాకంతో పాఠశాల గ్రాంట్లు తారుమారు

● గత విద్యా సంవత్సరం ఆధారంగా నిధుల కేటాయింపు

తెనాలి అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాఠశాలల అభివృద్ధికి మంజూరు చేసే గ్రాంట్లు తారుమారయ్యాయి. సమగ్ర శిక్ష అధికారుల నిర్వాకంతో తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలకు ఎక్కువ నిధులు, ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలకు తక్కువ నిధులు అందాయి. దీంతో పాఠశాల అవసరాలు తీర్చేందుకు ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పలు అవసరాల కోసం విద్యార్థుల సంఖ్య ఆధారంగా సమగ్ర శిక్ష నిధులు కేటాయించి పాఠశాలల నిర్వహణ కమిటీల ద్వారా ఖర్చు చేయించాలి. ఈ నిధులను సిఎఫ్ఎంఎస్ విధానంలో ఖాతాలకు జమ చేస్తారు. పాఠశాలల్లో 25 మంది విద్యారుల లోపు ఉంటే రూ.10 వేలు, ఆ సంఖ్య దాటితే రూ.25 వేలు, విద్యార్థుల సంఖ్య 200లు పైబడితే రూ.50 వేలు, 300 దాటితే రూ.75 వేలు, 500 మందికి పైబడితే రూ.లక్ష వంతున గ్రాంటు ఇవ్వాల్సి ఉంది. 2025-26 సంవత్సరానికి సంబంధించి గ్రాంటును విద్యార్థుల సంఖ్య ఆధారంగా అందించాలి. కానీ గత విద్యా సంవత్సరంలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా సమగ్ర శిక్ష నిధులను ఖాతాలకు మళ్లించింది. ఈ ఏడాది ప్రభుత్వం మోడల్ ప్రాథమిక పాఠశాలలను ప్రతి మండలంలో ఐదు నుంచి 10 వరకు ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో తక్కువ మంది విద్యార్థులుండగా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు గణనీయంగా పెరిగారు. గత ఏడాది విద్యార్థుల సంఖ్యను ఆధారంగా చేసుకుని నిధులు మంజూరు చేయడంతో తక్కువ గ్రాంటు అందింది. ఈ అంశాన్ని గుర్తించినప్పటికీ పలు మండలాల్లో ప్రధానోపాధ్యాయులు గాని మండల విద్యాధికారులు గాని సమగ్ర శిక్ష అధికారులకు విన్నవించి గ్రాంట్ల సమస్యను పరిష్కరించుకోలేకపోయారు. జిల్లా విద్యాశాఖాధికారులు జోక్యం చేసుకుని వెంటనే గ్రాంట్ల సమస్యను పరిష్కరించాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలి

● జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రజలు, అధికారులు అవగాహన పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ కోరారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆదివారం ఫోరమ్ ఫర్ ఆర్‌టీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈమని హనుమంతరావు ఆధ్వర్యంలో స్థానిక లాడ్జి సెంటర్ నుంచి అరండల్‌పేట పోలీస్ స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రజలు తమకు కావలసిన సమాచారాన్ని రాబట్టటం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 12 అక్టోబరు 2005న సమాచార హక్కు చట్టం తెచ్చిందని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమిషనర్ శామ్యూల్ జోనాథన్, కొండా శివరామిరెడ్డి, కొరివి వినయ్‌కుమార్, విల్సన్, డాక్టర్ ఎం.సుధ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా వాకింగ్ ట్రాక్

● గ్రౌండ్‌లో రోజుల తరబడి నిల్వ ఉంటున్న వర్షపు నీరు

● పొన్నూరు ఇండోర్ స్టేడియం వైపు కన్నెత్తి చూడని శాప్ అధికారులు


వాకింగ్ ట్రాక్‌లో నిలిచిన వర్షపు నీరు

పొన్నూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ఇండోర్ స్టేడియం సరైన నిర్వహణ లేక పాడయిపోతోంది. పొన్నూరు ప్రజల అవసరాల కోసం గత తెలుగుదేశం ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని చేపట్టింది. అనేక సమస్యల అనంతరం 2014లో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పనులు పూర్తి చేయించారు. ప్రజలు నడక, వ్యాయామం చేసేందుకు స్టేడియం చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో వాలీబాల్ ఇతర క్రీడలు ఆడుకునేలా గ్రౌండ్ సిద్ధం చేయించారు. స్టేడియంకు నిర్మాణ కమిటీని ఏర్పాటుచేసి అనుబంధంగా అభివృద్ధి కమిటీని నియమించారు. ఈ కమిటీ పర్యవేక్షణలో కొన్నాళ్లు స్టేడియం వాకింగ్ ట్రాక్ నిర్వహణ సక్రమంగానే జరిగింది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే స్టేడియం సమస్యలతో కొట్టుమిట్టాడే పరిస్థితి ఏర్పడింది. వైసీపీ నాయకులకు స్టేడియం అప్పగింతకు కమిటీ నాయకులు నిరాకరించడంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టేడియాన్ని శాప్ పరిధిలోకి తీసుకొచ్చి బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. ఆనాటి నుంచి స్టేడియం నిర్వహణ పూర్తిగా గతి తప్పింది.


పూడిపోయిన ట్రాక్ మురుగు నీటికి కాలువ

నిరుపయోగంగా వాకింగ్ ట్రాక్

పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో 65 వేల మంది జనాభా ఉన్నారు. దీనికి తోడు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వ్యాయామం, వాకింగ్ కోసం ఇక్కడకు వస్తుంటారు. 2019లో శాప్ పరిధిలోకి వెళ్లిన స్టేడియం వైపు ఆ శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో స్టేడియం అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. కేవలం ఒక ఇన్‌చార్జిని నియమించి చేతులు దులుపుకున్నారు. స్టేడియంకు సరైన ఆదాయం లేకపోవడంతో నిర్వహణను అభివృద్ధిని పూర్తిగా శాప్ అధికారులు నిర్లక్ష్యం చేశారు. దీని ఫలితంగా స్టేడియం పరిసర ప్రాంతాల్లో పూర్తిగా పిచ్చిచెట్లు, గడ్డి మొలిచి వాకింగ్ ట్రాక్ గ్రౌండ్ పనికిరాకకుండా పోయాయి. ఆటలాడే పిల్లలు సరైన సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు ట్రాక్‌ను కొంతవరకు బాగు చేసుకుని వినియోగించుకుంటున్నారు. అయితే ఇటీవల కురిసి భారీ వర్షాలకు గ్రౌండ్లో పెద్దఎత్తున నీరు నిలిచి వాకింగ్ ట్రాక్ పైకి చేరింది. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ట్రాక్ పైనే రోజులు తరబడి నిల్వ ఉంటోంది. శాప్ అధికారులు నిర్లక్ష్య వైఖరి కారణంగా పట్టణవాసులకు వ్యాయామం వాకింగ్ అందని ద్రాక్షగా మారే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా శాప్ అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్ బాగు చేయించాలని వాకర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్వహించలేకపోతే పాత కమిటీకే స్టేడియాన్ని అప్పగించాలని కోరుతున్నారు.


గ్రౌండ్‌లో నిలిచిన వర్షపు నీరు

మెడికల్ కళాశాలలపై దుష్ప్రచారం ఆపాలి

ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



పొన్నూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నాయకులు మెడికల్ కళాశాలపై దుష్ప్రచారాన్ని తక్షణమే ఆపాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదివారం అన్నారు. పాలన చేతకాక అడ్డగోలు జీవోలు జారీ చేసి ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టిన వైసీపీ నేడు ఉద్దేశ పూర్వకంగా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం పీపీపీ విధానం తీసుకొచ్చి మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వైసీపీ చిత్రీకరించడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని నియంత్రణ అంతా ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుందన్నారు. ప్రైవేటు సహకారం కేవలం నిర్మాణం, నిర్వహణకు మాత్రమే పరిమితం అవుతుందన్నారు. విశాఖపట్నంలో వైసీపీ ప్రభుత్వం తాకట్టుపెట్టిన ప్రభుత్వ ఆస్తులు మొత్తం విలువ రూ.1940 కోట్లని ఆరోపించారు. రూ.40వేల కోట్ల విలువైన భూములను కబ్జా చేశారని దుయ్యబట్టారు. విశాఖ నగరంలో 13 ప్రభుత్వ ఆస్తులకు చెందిన 128 ఎకరాల భూములకు ఎస్‌బీఐ క్యాప్ ట్రస్టీ కంపెనీకి తనఖాపెట్టి రెండువేల కోట్ల విలువైన భూములను అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. విజయవాడ భవాని ఐలాండ్ సమీపంలో బరంపార్క్, నెల్లూరు, కడప, దిండి, కర్నూలు హరిత రిసార్ట్‌తో పాటు మొత్తం 15 పర్యాటక ఆస్తులను రూ.147కోట్లకు తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణానికి తెలుగుదేశం ప్రభుత్వం కేటాయించిన 260ఎకరాల స్థలాలు, గృహాలను వైసీపీ ప్రభుత్వం తాకట్టుపెట్టి హడ్కో నుంచి రూ.500 కోట్లు రుణం తీసుకుందన్నారు. మద్యం అదనపు ఆదాయంపై సుంకం విధించి నిధులను కార్పొరేషన్‌కు మళ్లించి దాన్ని గ్యారెంటీగా చూపి 23వేల కోట్ల రుణం సమీకరించారని ధ్వజమెత్తారు. సచివాలయాలను తాకట్టుపెట్టి రూ.370కోట్లు ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన ఆస్తులు తనఖాపెట్టి రూ.7వేల కోట్లు రుణం తీసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను, రాష్ట్ర ప్రతిష్ఠను తాకట్టుపెట్టి నేడు అధికారపక్షంపై తప్పుడు ప్రచారం చేసి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివాహ సమాచార వేదికలు అవసరం

● రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కామేశ్వరప్రసాద్

తెనాలి అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వివాహ సమాచారాన్ని అందించే వేదికలు నేటి ఆధునిక కాలంలో ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కామేశ్వరప్రసాద్ అన్నారు. బోసురోడ్డులోని ఎస్‌ఆర్‌కే కల్యాణ మండపంలో ఆదివారం బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన సభలో వివాహ పరిచయ వేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, శాఖా బేధాలను చూడకుండా వివాహాలకు ముందుకు రావాలని కోరారు. రాష్ట్రస్థాయిలో పరిచయ వేదికలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు. వివిధ రాష్ట్రాల నుంచి 750 కుటుంబాలు వేదికను ఉపయోగించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఆదివారం కమిటీ ఆధ్వర్యంలో వివాహ సమాచారాన్ని ఉచితంగా అందిస్తున్న సభ్యులను అభినందించారు.

కార్యక్రమంలో పలువురు బ్రాహ్మణ ప్రముఖుల దంపతులను సన్మానించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు ప్రకాశరావు, రాజేంద్రప్రసాద్, సూర్యప్రకాశరావు, సుబ్బారావు, సత్యబాబు, రామ్మోహన్, హరిప్రసాద్, ఉమాదేవి, రాంబాబు, శ్రీనివాసమూర్తి, ఆదినారాయణ, వేణుగోపాల్, వేణుధర్ పాల్గొన్నారు.



డాక్టర్ శారదను సన్మానిస్తున్న మల్లెపాడు గ్రామస్థులు

డాక్టర్ శారదకు మల్లెపాడు వాసుల సత్కారం

తెనాలి అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గైనకాలజిస్టు డాక్టర్ శారద అందిస్తున్న సేవలు ఎనలేనివని మల్లెపాడు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో ఆదివారం మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, గుండె, ఊపిరితిత్తుల పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. గ్రామస్తులు డాక్టర్ శారదను ఘనంగా సన్మానించారు. కరోనా కష్టకాలంలో ధైర్యంగా రోగులకు విశేష సేవలు అందించడమే కాకుండా రూ.లక్షలు వెచ్చించి పరికరాలు అందించారని, ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని చావలి రాజేంద్రప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో మొవ్వా డేవిడ్, చంద్రశేఖర్, లోకయ్య, అఖిల్, శ్యామ్, దినేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.


ఈతల్లో పాల్గొన్న స్విమ్మర్స్

కొమ్మమూరు కాల్వను ఈదిన స్విమ్మర్స్

తెనాలి అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన ఈతగాళ్లు కొమ్మమూరు కాల్వను ఈది రికార్డు నెలకొల్పారు. సంగం జాగర్లమూడి వద్ద ఉన్న కాల్వను కొలకలూరు నుంచి సంగం జాగర్లమూడి వరకు 7 కి.మీ దూరాన్ని అవలీలగా ఈదారు. స్విమ్మర్లు రామమోహన్, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, అర్జునరావు, సాయి, గిరిధర్, ఆంజనేయులు, కుమార్, రాము, రమణ ఆదివారం ఈ ఘనత సాధించారు. స్విమ్మర్స్ అంతా బృందంగా ఏర్పడి ప్రతి ఆదివారం గత కొన్నేళ్లుగా స్విమ్మింగ్ చేస్తున్నారు. ఈ ఘనత సాధించిన వారిని పలువురు అభినందించారు.

ఈ రోడ్లపై ప్రయాణం నరకయాతనే...

● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


అధ్వానంగా తయారైన వల్లభాపురం నుంచి ఈమని మీదుగా తెనాలి వెళ్ళే రోడ్డు

కొల్లిపర , అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. తరుచూ ప్రయాణించే రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు ... రైతులు నరకయాతనపడుతున్నారు. ప్రధానరహదారులు దెబ్బతిని సంవత్సరాల తరబడి కావస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో వల్లభాపురం నుంచి ఈమని మీదుగా తెనాలి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు గోతులమయంగా మారటంతో పాటు గులక రాళ్ళు లేచి ఉండటంతో వాహనదారులు ప్రయాణం చేయాలంటేనే భయపడుతున్నారు. ఈ రోడ్డు దెబ్బతిని సంవత్సరాలు కావస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోక పోవడంతో ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. తెనాలి వెళ్ళటానికి వల్లభాపురం నుంచి ఈమని మీదుగా వెళ్ళాల్సిందే. వాహనాలు తిరిగే మార్గం కావటంతో ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా మున్నంగి నుంచి చివలూరు వెళ్లే రోడ్డు కూడా మరింత అధ్వానంగా తయారైంది. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. రోడ్డు గుంతలు, గుంతలుగా మారడంతో ప్రయాణం చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోక పోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై రాత్రి సమయాల్లో వాహనదారులు వెళ్ళాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పూర్తిగా దెబ్బతిన్న మున్నంగి నుంచి చివలూరు వెళ్లే రోడ్డు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కంటి వైద్య శిబిరంలో 375 మందికి పరీక్షలు

తెనాలి క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ సేవా సమితి శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో అత్యధిక సంఖ్యలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సేవా సమితి సభ్యులు వెల్లడించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన 375 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 120 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారన్నారు. వీరికి మంగళవారం కమిటీ శస్త్ర చికిత్సలతో పాటు అన్ని సౌకర్యాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వరద వెంకటశేషగిరిరావు, పెండేల సుబ్బారావు, గుర్రం భాస్కర వెంకటసుధీర్, యక్కల శ్రీమన్నారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా జస్టిస్ అంబటి లక్ష్మణరావు విగ్రహావిష్కరణ


జస్టిస్ అంబటి లక్ష్మణరావు విగ్రహ ఆవిష్కరణ చేస్తున్న కుటుంబసభ్యులు, ప్రముఖులు

పొన్నూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ అంబటి లక్ష్మణరావు ఆశయాలను కొనసాగిస్తామని ఆయన కుమారుడు డాక్టర్ అంబటిరామ్ పాపారావు అన్నారు. పొన్నూరు మండలంలోని వెల్లలూరు గ్రామంలో ఆదివారం న్యాయకోవిదుడు అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి దివంగత జస్టిస్ డాక్టర్ అంబటి లక్ష్మణరావు కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, జస్టిస్ లక్ష్మణరావు చేసిన సేవలను కొనియాడారు. గ్రామంలో శాంతిని నెలకొల్పటానికి ఆయన తీసుకున్న చర్యలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెండు లింగయ్య నాయుడు, అంబటి నాగేశ్వరరావు, మెండు చక్రపాణి, ఆవుల రంగబాబు, సుధా వెంకటేశ్వరరావు, డేగల వెంకటేశ్వరరావు, మారా బత్తుల పుల్లయ్య, డాక్టర్ వెలివల ప్రసాద్, వెలివల పూర్ణచంద్రరావు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి విరాళం

దుగ్గిరాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం అభివృద్ధి నిమిత్తం, తెనాలికి చెందిన అమ్మవారి భక్తుడు కొర్ల కృష్ణారావు, రూ.లక్షా 116లను విరాళంగా అందించారు. కృష్ణారావును దుశ్శాలువాతో సత్కరించి, అర్చకుడు తారక్‌నాథ్ అమ్మవారి చిత్రపటాన్ని అందించారని ఈవో కోగంటి సునీల్‌కుమార్ తెలిపారు.



అంగలకుదురు వాసుదాసాశ్రమంలో హోమాలు


హోమం నిర్వహిస్తున్న సీతారామదాసు స్వామి

తెనాలి అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని అంగలకుదురు వాసుదాసాశ్రమంలో ఆదివారం హోమాలు నిర్వహించారు. పీఠాధిపతి సీతారామదాసు స్వామి ఆధ్వర్యంలో మూడు హోమ గుండాలు ఏర్పాటు చేసి గణపతి సచ్చిదానందస్వామి శిష్య బృందం దత్తాత్రేయ హోమం జరిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని హోమం నిర్వహిస్తున్నామని రామదాసుస్వామి తెలిపారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆశ్రమంలో ప్రతిరోజు నిత్య తిరువారాధన, విష్ణుసహస్రనామ పారాయణ, హనుమాన్ చాలీసా పారాయణ, మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన, దాస నామార్చనలు జరుగుతాయని భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని రామదాసు స్వామి కోరారు.


కోడి పందెం రాయుళ్ళను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

జూదరుల అరెస్టు

గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు నిర్వహిస్తున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై టాస్క్ ఫోర్స్ బృందం దాడులు కొనసాగిస్తోంది. ఆదివారం వెనిగండ్ల గ్రామం శివారు పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి సమాచారం అందింది. సీఐ ఆళహరి శ్రీనివాస్ ద్వారా ఎస్పీకి తెలియపరచి ఆయన ఆదేశాల మేరకు పెదకాకాని స్టేషన్ ఎస్సై మీరాజ్‌తో కలసి దాడి చేశారు. కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, 2 కోళ్లను, 38 కోళ్లకు కట్టే కత్తులను, ఏడు సెల్ ఫోన్లు, 17 ద్విచక్ర వాహనాలు, రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వసంతరాయపురంనకు చెందిన షేక్ సైదా, పాత గుంటూరుకు చెందిన మలిడి కుమార్, చినకోండ్రుపాడుకు చెందిన షేక్ సలీం, డొంకరోడ్డుకు చెందిన మెల్ల శివ, పాతగుంటూరుకు చెందిన జి.రాకేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కోడిపందేలను పాతగుంటూరుకు చెందిన రవికాంత్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. విచారణ జరిపి అతనిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.